

కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఉపాధిని పటిష్టంగా అమలు చేయాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

టంగుటూరు (ఒంగోలు కలెక్టరేట్), మే 8(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులను పటిష్టంగా చేపట్టడంతో పాటు కూలీలకు సరాసరి కూలి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. టంగుటూరు మండలం జయవరం గ్రామపంచాయతీలో జరుగుతున్న పనులను గురువారం తనిఖీచేశారు. గ్రామంలో సాగునీటి కాలువ పూడికతీత పనులను పరిశీలించి అక్కడ పనిచేస్తున్న కూలీలతో కలెక్టర్ మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనిచేసిన దానికి సకాలంలో వారి ఖాతాల్లో డబ్బులు పడుతున్నాయా లేదా? అని ఆరా తీశారు. కూలీల హాజరు పట్టిక, పని ప్రదేశంలో తాగునీరు, నీడ షెడ్డు తదితర మౌలిక సదుపాయాల కల్పన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ఉపాధి పథకం కింద నిర్మించిన పశువుల తొట్టెలను కలెక్టర్ ప్రారంభించారు.

టీచర్ల బదిలీలకు రంగం సిద్ధం

● కసరత్తు ప్రారంభించిన విద్యాశాఖ

● 3వేల మందికిపైగా స్థానచలనం

ఒంగోలు విద్య, మే 8(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సాధారణ బదిలీలకు రంగం సిద్ధమైంది. విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. పాఠశాలల పునఃప్రారంభంలోపు ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు, బదిలీల ప్రక్రియ పూర్తిచేయాలని ప్రభుత్వం పట్టుదలగా ఉంది. ఈక్రమంలో పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, ఉపాధ్యాయుల పునర్విభజన ప్రతిపాదనలు జిల్లా నుంచి పాఠశాల విద్యా కమిషన్ కార్యాలయానికి అందాయి. కమిషనర్ ఆమోదముద్ర వేయనున్నారు. ఈ నేపథ్యంలో మండలాల వారీగా ఆ ప్రతిపాదనలను ఆన్‌లైన్‌లో మళ్లీ మండల విద్యాధికారులకు పంపి వారి పరిశీలన అనంతరం ఆమోదముద్ర వేస్తారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 56 మండలాల ఎంఈవోలు జాబితాలను ధ్రువీకరిస్తూ ఆమోదముద్ర వేయాల్సి ఉంది.

ఉపాధ్యాయుల సర్దుబాటుకు కసరత్తు

జిల్లాలో టీచర్ల సర్దుబాటు ప్రక్రియ, రేషనలైజేషన్, బదిలీలకు సంబంధించిన ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. స్థానిక డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో ఎంఈవోల సమావేశం నిర్వహించి బదిలీలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించారు. జిల్లా విద్యాశాఖలో ఉన్న సమాచారం మేరకు ఐదేళ్లు ఒకే స్థానంలో పనిచేసిన హెచ్ఎంలు, ఎనిమిదేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న ఎస్టీటీల వివరాలను ఉప విద్యాధికారులు, ఎంఈవోలకు ఇచ్చి వారి నుంచి ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నారు. ఆ జాబితాల్లోని తేడాలను సరిచేశారు. దీంతో బదిలీలకు సంబంధించి ప్రాథమికస్థాయి కసరత్తు పూర్తయినట్లు అయింది.

3వేల మందికిపైగా బదిలీలు

జిల్లాలో ఐదేళ్లు ఒకే పాఠశాలలో పనిచేసిన గ్రేడ్-2 హెచ్ఎంలు (హైస్కూలు), ఎనిమిదేళ్లు పనిచేసిన సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూలు అసిస్టెంట్లు, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు సుమారు 3వేల మందికిపైగా తప్పనిసరిగా బదిలీలు కానున్నారు.

● హెచ్ఎంలు ప్రభుత్వ పాఠశాలల్లో ఇద్దరు, మున్సిపాలిటీల్లో ముగ్గురు, జడ్పీ హైస్కూళ్లలో 15 మంది మొత్తం 20 మంది మారాల్సిందే.

● స్కూలు అసిస్టెంట్లు తెలుగు 84, హిందీ 110, ఇంగ్లీషు 150, గణితం 251, బయాలజికల్ సైన్స్ 127, ఫిజికల్ సైన్స్ 322, సోషల్ స్టడీస్ 82, వ్యాయామ విద్య 38మంది తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంది.

● సెకండరీ గ్రేడ్ టీచర్లు తెలుగు 1,919, ఉర్దూ 45, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు 16, పీఈటీలు 11 మంది తప్పనిసరిగా బదిలీలు కావాల్సిన వారి జాబితాల్లో ఉన్నారు.

● పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ, టీచర్ల పునర్విభజనలో సర్దుబాటు వల్ల మరికొంత మంది టీచర్లు తప్పనిసరిగా బదిలీ కావాల్సి వస్తోంది. దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఉత్తర్వులు వస్తేనే ఎంతమంది టీచర్లకు స్థానచలనం ఉంటుందనేది తెలుతుంది.



ఉపాధి హామీ పథకం పనులు జిల్లాలో ముమ్మరంగా జరుగుతున్నాయి. రోజువారీ ప్రస్తుతం లక్షా 80 వేల మంది వరకు కూలీలు పనులకు వస్తున్నారు. ఇంచుమించు అన్ని గ్రామపంచాయతీల్లోనూ ఈ పనులు ప్రారంభమయ్యాయి. పంచ ప్రాధాన్యాల పేరుతో ఐదు అంశాలపై అధికారులు దృష్టిసారించారు. వచ్చే జూన్ ఆఖరు నాటికి కోటీ 11 లక్షల పని దినాల కల్పన లక్ష్యంతో ఊరూరా పనులు చేపట్టారు. గతేడాది కన్నా ప్రస్తుత సంవత్సరం కూలీలకు అధిక వేతనం లభించేలా పనులు చేయిస్తున్నారు. తద్వారా వచ్చే మెటీరియల్ కోటా నిధులు అధికంగా రాబట్టి గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులు భారీగా జరిగేలా ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. తదనుగుణంగా జిల్లాలో డ్వామా అధికారులు కార్యాచరణ చేపట్టారు.

ఉపాధి జోరు

పల్లెల్లో కూలీలకు ముమ్మరంగా పనులు

రోజువారీ లక్షా 80 వేలమంది హాజరు

జిల్లాలోని అన్ని పంచాయతీల్లో నిర్వహణ

పంచ ప్రాధాన్యాల పేరుతో ఐదు అంశాలపై కేంద్రీకరణ

జూన్ ఆఖరుకు 1.11కోట్ల పనిదినాల కల్పన లక్ష్యం

ప్రత్యేక దృష్టిసారించిన కలెక్టర్, డ్వామా పీడీ

ఒంగోలు, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 2024-25లో పథకం అమలు తీరు చూస్తే కోటీ 35 లక్షల పనిదినాల కల్పన లక్ష్యం కాగా కోటి 29 లక్షల పనిదినాలు కల్పించారు. మొత్తం 4.42 లక్షల జాబ్ కార్డులు ఉండగా 2.95లక్షల కార్డులకు చెందిన 5.06 లక్షల మంది ఈ పనులు చేశారు. సగటున ఒక్కొక్కరికీ రోజుకు రూ.209 వంతున సుమారు రూ.272 కోట్ల మేర కూలి రూపంలో లభించింది. మెటీరియల్ కోటా కింద రూ.180 కోట్ల విలువైన 1,369 పనులు చేపట్టి సుమారు రూ.132 కోట్ల విలువైన 1,180 పనులు పూర్తిచేశారు. మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

కోటిన్నర పనిదినాలు లక్ష్యం

ప్రస్తుత సంవత్సరం దాదాపు కోటిన్నర పనిదినాల కల్పన లక్ష్యంగా నిర్దేశించారు. జిల్లాలో రోజూ 2.5లక్షల మంది కూలీలకు పని కల్పించాలని అధికారులు నిర్ణయించారు. కేంద్రం రోజుకు రూ.307 వేతనంగా ప్రకటించగా జిల్లాలో రోజువారీ వేతనం సగటున రూ.290కి తగ్గకుండా ఉండేలా పనులు చేయించాలని జిల్లా యంత్రాంగం లక్ష్యంగా నిర్దేశించుకొంది. తద్వారా దాదాపు రూ.435 కోట్ల వరకు వేతన రూపంలో కూలీలకు లభించనుండగా ఇంచుమించు రూ.300 కోట్ల మేర మెటీరియల్ కోటా కింద నిధులు అందుబాటులోకి వస్తాయని అంచనా. తద్వారా భారీగా పల్లెల్లో అభివృద్ధి పనులు చేయవచ్చు. దీంతో ఆ లక్ష్యసాధన కోసం కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రత్యేక దృష్టి సారించగా తదనుగుణంగా క్లస్టర్ల, మండలాల వారీ లక్ష్యాలను డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ రూపొందించారు.

లక్ష్యం ఘనం.. ఆచరణ ప్రారంభం

జిల్లాలో 1842 నీటి తొట్లను మంజూరు చేయగా ఇప్పటికే 1033 పూర్తిచేశారు. మరో 344 నిర్మాణాలు త్వరలో పూర్తికానున్నట్లు సమాచారం. రెండో అంశంగా పొలాల్లో నీటి కుంటలు (ఫాంపాండ్స్) తవ్వకాలు కాగా జిల్లాకు 9,143 ఇప్పటివరకు మంజూరు చేస్తే 168 పూర్తయ్యాయి. 1,542 పురోగతిలో ఉన్నాయి. మూడవదిగా నాలుగు వేల కిలోమీటర్ల కాలువలలో పూడికతీత లక్ష్యంగా పెట్టారు. వెయ్యి కిలోమీటర్ల పనులు పురోగతిలో ఉన్నాయి. నాలుగవదిగా చెరువులు, గ్రామాల్లో నీటి కుంటలు అభివృద్ధి కాగా ఒక్కో గ్రామానికి కనీసం ఒకటి అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకొని ఇప్పటివరకు 526 చెరువులను గుర్తించి అంచనాలు సిద్ధం చేస్తున్నారు. అక్కడక్కడా ఈ పనులు కూడా ప్రారంభం అయ్యాయి. ఇక ఐదవ అంశంగా సగటున రోజువారీ వేతనం రూ.290 లభించేలా చేయాలని నిర్ణయించారు. కేంద్రం రూ.307 సగటు వేతనం ప్రకటించగా గత ఏడాది జిల్లాలో రూ.209 మాత్రమే కూలీలకు లభించింది. దీంతో ఈ ఏడాది మరింత దృష్టిసారించి సగటు వేతనం పెరిగేలా చేయాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం రూ.248 వరకు లభిస్తోంది.

అనుకున్న లక్ష్యం సాధిస్తాం

జిల్లాలో రోజువారీ 2.5లక్షల మంది కూలీలు పనులకు వచ్చేలా ప్రణాళిక రూపొందించాం. ఉపాధి పనులు పురోగతిలో ఉన్నాయి. ప్రస్తుతం రోజువారీ లక్ష 70వేల నుంచి లక్షా 80 వేల వరకు కూలీలు పనులకు వస్తున్నారు. మరింత మంది వచ్చేలా గ్రామాలలో పనులను గుర్తించి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. తద్వారా మూడు మాసాలకు నిర్ణయించుకున్న లక్ష్యాన్ని సాధిస్తాము. పంచ ప్రాధాన్యాలకు అనుగుణంగా పనులు చేపడుతున్నాం.

-జోసఫ్ కుమార్, డ్వామా పీడీ

ఈ మూడు నెలలే కీలకం

గత నెలాఖరులో జరిగిన కలెక్టర్ల సదస్సులో ఉపాధి పనులపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. తదనుగుణంగా డ్వామాలో ఈ పనులు పర్యవేక్షించే మండల స్థాయి సిబ్బందికి కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఏడాది మొత్తంలో అధికంగా పనులు జరిగేవి ఏప్రిల్ నుంచి జూన్ వరకు కావడంతో మూడింట రెండొంతుల పనులు ఈ సమయంలోనే పూర్తిచేయాలని ప్రణాళిక రూపొందించారు. అందులో ప్రభుత్వ ప్రాధాన్యతగా ప్రకటించిన ఐదు అంశాలపై ఫోకస్ పెట్టారు. పంచ ప్రాధాన్యతల పేరుతో వీటిని చేపడుతుండగా జూన్ ఆఖరులోపు కోటీ 11 లక్షల పనిదినాల కల్పనగా లక్ష్యం నిర్దేశించుకున్నారు. ప్రస్తుత వేసవిలో పశ్చిమ ప్రాంతంలో మనుషులకే కాక పశువులకు కూడా నీటి సమస్య తీవ్రంగా ఉండటంతో పొలాల్లో నీటి తొట్ల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

మీకోసం 13కి మార్పు

ఒంగోలు కలెక్టరేట్, మే 8 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఈనెల 12వ తేదీన సోమవారం జరిగే గ్రీవెన్స్‌సెల్‌ను రద్దు చేసినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఆ రోజున డీఆర్సీ సమావేశం ఉండటంతో మీకోసం కార్యక్రమాన్ని మార్చామన్నారు. ఈనెల 13వ తేదీన కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో మీ కోసం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

నవ శింగరకొండ

● పూర్తిగా మారిపోయిన అంజన్న ఆలయం

● రూ.6.35 కోట్లతో రాతిముఖ మండపం నిర్మాణం

● 19న మహా కుంభాభిషేకం

7



జిల్లాలోని ఒక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కూడా ఏ గ్రేడుకు నోచుకోలేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అందిస్తున్న వైద్యసేవల ఆధారంగా ప్రభుత్వం గ్రేడ్‌లను ప్రకటించింది. జిల్లాలో 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ప్రభుత్వం గ్రేడ్లు ప్రకటించగా బీ గ్రేడ్‌లో తొమ్మిది ఉన్నాయి. సీ గ్రేడ్‌లో అత్యధికంగా 49, డీ గ్రేడ్‌లో ఆరు కేంద్రాలు ఉన్నాయి. అంటే ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నా సరే క్షేత్రస్థాయిలో మాత్రం సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయనేది ఈ గ్రేడ్ల ద్వారా స్పష్టం అవుతోంది. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాథమిక వైద్యశాలలను పటిష్టం చేసేందుకు పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. అయితే క్షేత్ర స్థాయిలో మాత్రం ఆశించిన స్థాయిలో మెరుగుపడలేదనే చెప్పవచ్చు.

ఒంగోలు కలెక్టరేట్, మే 8(ఆంధ్రజ్యోతి): వైద్యశాలల్లో రోగులకు అందుతున్న సేవలను ప్రామాణికంగా తీసుకొని ప్రభుత్వం గ్రేడ్‌లను ఇస్తోంది. అయితే జిల్లాలో 64 పీహెచ్‌సీలు ఉంటే ఒక్క కేంద్రానికి కూడా ఏ గ్రేడ్ లేదంటే వాటి పరిస్థితి ఏవిధంగా అర్థం చేసుకోవచ్చు. మార్చి నెలకు సంబంధించి తాజాగా ఈ వివరాలను ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో అర్ధవీడు పీహెచ్‌సీ చిట్టచివరన ఉంది. ఆయా పీహెచ్‌సీలకు రోజువారీ ఎంతమంది రోగులు వస్తున్నారు, వారికి చేసే వైద్య పరీక్షలు, గర్భిణులకు అందిస్తున్న సేవలు, ప్రసవాలు వంటి వాటిని పరిశీలించి వైద్య ఆరోగ్యశాఖ గ్రేడ్లను కేటాయిస్తుంది. అయితే జిల్లాలోని అన్ని కేంద్రాలు బాగా వెనుకబడినట్లు తేలింది. మరోవైపు ప్రజలకు కేంద్రప్రభుత్వం మెరుగైన సేవలు అందించేందుకు ఒక్కొక్క పీహెచ్‌సీకి రూ.1.75 లక్షల వంతున నిధులు విడుదల చేస్తోంది. అంతా ఖర్చుచేస్తున్నా ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందడం లేదు.



మన పీహెచ్‌సీలు పూర్

జిల్లాలో ఏ ఒక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికీ దక్కని ఏ-గ్రేడ్

సేవల ఆధారంగా స్థాయిని ప్రకటించిన ప్రభుత్వం

బీ గ్రేడ్‌లో తక్కువ వైద్యశాలలు

ఎక్కువగా సీ గ్రేడ్‌కే పరిమితం

జిల్లాలో పీహెచ్‌సీల వివరాలు

ఏ గ్రేడ్ : 00

బీ గ్రేడ్ : 09

సీ గ్రేడ్ : 49

డీ గ్రేడ్ : 06

మొత్తం : 64

మొదటి స్థానంలో మద్దిపాడు

జిల్లాలో ఏ గ్రేడ్ ఒక్క ప్రాథమిక వైద్యశాలకు లేనప్పటికీ మద్దిపాడు పీహెచ్‌సీ జిల్లాలో మొదటి స్థానంలో నిలువగా రాష్ట్రస్థాయిలో 124వ స్థానంలో ఉంది. ఇక అర్ధవీడు పీహెచ్‌సీ చివరి స్థానంలో నిలిచి డీ గ్రేడ్‌లో ఉండగా రాష్ట్రస్థాయిలో 1,058వ స్థానంలో ఉంది. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకోవడంతోపాటు వైద్యులు, ఇతర సిబ్బంది సకాలంలో ఆస్పత్రులకు హాజరయ్యేందుకు ముఖ ఆధారిత హాజరును కూడా అందుబాటులోకి తెచ్చింది. అయినా ఆయా వైద్యశాలలు మెరుగుపడలేదు. వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు గ్రేడింగ్ విధానంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వెనుకబడి ఉండటంతో ఆయా గ్రేడ్‌లను పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం.

రైస్‌కార్డుల కోసం భారీగా దరఖాస్తులు

గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నమోదు

తొలిరోజు 538 మంది దరఖాస్తు

అత్యధికంగా మెంబర్ యాడింగ్ కోసం 329

ఒంగోలు కలెక్టరేట్, మే 8 (ఆంధ్రజ్యోతి): కొత్త రైస్‌కార్డుల కోసం జనం భారీగా దరఖాస్తు చేసుకుంటున్నారు. ప్రభుత్వం బుధవారం నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్హులైన పేదలు కొత్త రైస్ కార్డులతో పాటు చేర్పులు, మార్పులు, తొలగింపులకు అవకాశం ఇవ్వడంతో ప్రజలు పరుగులు పెడుతున్నారు. జిల్లాలో సచివాలయాల ద్వారా బుధవారం ఒక్కరోజే 538 దరఖాస్తులు వచ్చాయి. అందులో కొత్త కార్డుల కోసం 130 దరఖాస్తులు రాగా ప్రస్తుతం ఉన్న రైస్‌కార్డుల్లో మెంబర్ యాడింగ్ (చేర్పులు) కోసం అత్యధికంగా 329 వచ్చాయి. మరోవైపు రేషన్ కార్డుల్లో తప్పులు సరిచేసుకునేందుకు, పేరు తొలగింపుల కోసం కూడా దరఖాస్తులు వస్తున్నాయి.

వీరయ్యకు నివాళి

● ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్

● సంస్మరణ సభకు తరలిన టీడీపీ శ్రేణులు

7



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, బీఎన్

పట్టించుకోరూ.. పరిష్కరించరు..!

● పెళ్లూరు ఎస్సీ కాలనీలో వేధిస్తున్న విద్యుత్ సమస్య
● ఇబ్బందిపడుతున్న స్థానికులు

ఒంగోలు కార్పొరేషన్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర పరిధిలోని పెళ్ళూరు ఎస్సీ కాలనీలో ప్రతి రోజు విద్యుత్ సమస్య కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆ కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీలో విద్యుత్ కండక్టర్లు సరిగా లేకపోవడంతో ప్రతిరోజు పగలు, రాత్రి కరెంటు సరఫరాలో హెచ్చు తగ్గులతో తీవ్ర అవస్థలు పడుతున్నామని తెలిపారు. ఓల్టేజీ సమస్యతో ఇళ్ళలోని ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత పదిరోజుల నుంచి ఈ సమస్య అధికంగా ఉండటంతో ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, టీవీలు పాడైపోయాయని వాపోయారు. గ్రామంలో సుమారు 1300 కిపైగా విద్యుత్ కనెక్షన్లు ఉండగా, హై ఓల్టేజ్, లో ఓల్టేజ్ సమస్య వేధిస్తుందని తెలిపారు. సమస్యను అనేకసార్లు విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫారం

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెలోనే..

● సీహెచ్‌వోల సష్టీకరణ


నిరసన దీక్ష చేస్తున్న సీహెచ్‌వోలు

ఒంగోలు కలెక్టరేట్, మే 8 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందని ఏపీఎంసీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందగిరి రాజేష్ పేర్కొన్నారు. సీహెచ్‌వోలు స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు గురువారానికి పదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు గత పది రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం ఇంత వరకు పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో గత ఏడేళ్ళ నుంచి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నా ప్రభుత్వం తమపై కనికరంచూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తోందని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి ప్రసన్న, ఉపాధ్యక్షురాలు జీవనజ్యోతి, జయశ్రీ, రమేష్ కమేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా వరసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ఠ

● ఒంగోలు, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్ ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు దామచర్ల, విజయ్‌కుమార్ తదితరులు

మద్దిపాడు, మే 8(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. అదేవిధంగా ధ్వజ, యంత్ర, గుడిశిఖర ప్రతిష్ఠలను వేదపండితులు ఇంజమూరి అచ్యుతానంద శర్మ అవధాని యాజ్ఞీకంలో నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా గత మూడు రోజులుగా హోమాలు, పూజలు జరిగాయి. విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, మహాన్యూస్ చైర్మన్ మారెళ్ల వంశీ, టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో మండవ రంగారావు, మండవ గోపీచంద్, పోకూరి శ్రీనివాసరావు, చింతల శ్రీనివాసరావు, చెరుకూరి వాసు, ముక్కారి మురళి, రావి నరసింహారావు, పారా నరసింహారావు, తుమ్మల సుధాకర్, ముత్తనపల్లి రామలింగయ్య, రెబ్బవరపు ప్రభాకరరావు, రావి మహేష్, గ్రోత్ సెంటర్ పరిశ్రమల యజమానులు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

● వాక్‌థాన్ నిర్వహణ


వేడుకలు జరుపుకుంటున్న హాస్పిటల్ నర్సింగ్ సిబ్బంది

ఒంగోలు కార్పొరేషన్, మే 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఒంగోలులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వాక్‌థాన్‌ను చేపట్టారు. హాస్పిటల్ నుంచి ప్రారంభమైన వాక్‌థాన్‌ను ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ నితిన్ నల్లూరి జెండా ఊపి ప్రారంభించారు. మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ రోగులకు సేవలందించడంలో నర్సుల సేవలు అమూల్యమైనవి అన్నారు. అంకితభావంతో వారు అందించే సేవలు, చూపించే అభిమానం రోగులకు మరింత ధైర్యం ఇవ్వడంతోపాటు సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. నర్సుల నిస్వార్థమైన సేవలను గుర్తిస్తూ, వారికి కృతజ్ఞతలు చెప్పే ఉద్దేశంతో వాక్‌థాన్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వంశీకృష్ణ, వైద్యులు, యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం


అచలానంద ఆశ్రమంలో జరిగిన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్


ఎన్‌జీపాడులో శేషవాహనంపై వీరబ్రహ్మేంద్రస్వామి

● ఎమ్మెల్యే దామచర్ల ప్రత్యేక పూజలు

ఒంగోలు(కల్చరల్), మే 8(ఆంధ్రజ్యోతి): శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణోత్సవం గురువారం ఘనంగా జరిగింది. స్థానిక మంగమూరు రోడ్డు శ్రీ అచలానంద ఆశ్రమం దగ్గర ఏర్పాటుచేసిన ఈ కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హాజరై పూజలు నిర్వహించారు. ఆయనకు ఆశ్రమ నిర్వాహకులు శ్రీపరిపూర్ణ సిద్ధానంద స్వామి సాదర స్వాగతం పలికారు. అనంతరం కల్యాణ క్రతువులను రుత్విక్కులు పూసపాటి నాగేశ్వరరావు బృందం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. అదేవిధంగా స్వామివారి నగరోత్సవం కన్నులపండుగగా నిర్వహించగా భక్తులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు మండలంలో..

నాగులుప్పలపాడు: స్థానిక శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు శేషవాహనంపై దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి సాయిమణికంఠ భక్త బృందం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం జరిగింది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఉప్పుగుండూరు గ్రామంలో శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయంలో ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ పూజారి గోనుగుంట వీరబ్రహ్మాచారి ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. అలాగే భారీగా అన్నప్రసాద వితరణ చేశారు. రాత్రికి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా పోలీసుల తనిఖీలు

● ఎస్పీ దామోదర్ పరిశీలన



అద్దంకి బస్టాండ్ సెంటరులో తనిఖీలను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్


ఆర్టీసీ బస్టాండ్ వద్ద తనిఖీలు



ఒంగోలు క్రైం, మే8(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో గురువారం పోలీసులు విస్తృత స్థాయిలో జిల్లావ్యాప్తంగా తనిఖీలు నిర్వహించారు. రాత్రి పొద్దుపోయే వరకు తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో ఎస్పీ ఏఆర్.దామోదర్ ఒంగోలు నగరంలో జరుగుతున్న తనిఖీలను పర్యవేక్షించారు. ముఖ్యంగా వాహనాలలో ఏదైనా పేలుడు పదార్థాలు ఉన్నాయ అని బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. కారులు, ఆటోలలో తరలిస్తున్న వస్తువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భద్రతా చర్యల్లో భాగంగా తనిఖీలు చేపట్టామన్నారు. ఎక్కడైన అనుమానితులు ఉన్నా, అనుమానంగా బ్యాగులు, వస్తువులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఆయన వెంటన డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, సీఐలు ఉన్నారు. అలాగే జిల్లాలో అనేక ప్రాంతాలలో పోలీసు సిబ్బంది తనిఖీలలో పాల్గొన్నారు.

ప్రభుత్వ అధ్యాపకులకు పునశ్చరణ తరగతులు


తరగతులకు హాజరైన అధ్యాపకులు

ఒంగోలు విద్య, మే 8(ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ విద్యలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల్లో భాగంగా వివిధ సబ్జెక్టుల్లో మారిన సిలబస్‌కు అనుగుణంగా అధ్యాపకులకు పునశ్చరణ తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ తరగతులను జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న ఎకనామిక్స్, సివిక్స్, జువాలజీ సబ్జెక్టు అధ్యాపకులకు ఒంగోలులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధ, గురువారాల్లో పునశ్చరణ తరగతులు నిర్వహించారు. ఈ తరగతులను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఐ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పరిశీలకులుగా ప్రిన్సిపాల్స్ కేపీ రంగనాయకులు, ఎస్‌కే నాజర్‌బాబు, సౌజన్య, తారక్‌నాథ్‌లు వ్యవహరించారు.

దేశవ్యాప్త సమ్మెకు ఆర్పీల మద్దతు


పీడీ శ్రీహరికి సమ్మె నోటీసును అందజేస్తున్న ఆర్పీలు

ఒంగోలు కార్పొరేషన్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా రిసోర్స్‌పర్సన్ (ఆర్పీ)లు సంఘం మద్దతు తెలియజేస్తున్నట్లు ఆర్పీల సంఘం అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు మెప్మా ఆర్పీలు గురువారం ఒంగోలులో పీడీ శ్రీహరిని కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు కనీస వేతనాలు చెల్లించాలని, 2019 నుంచి రిజిస్ట్రేషన్ అయిన ఆర్పీలకు లాగిన్ ఇవ్వాలన్నారు. బకాయి వేతనాలు చెల్లించడంతోపాటు గ్రేడింగ్ విధానం రద్దు చేసి రూ.10వేల గౌరవ వేతనాన్ని ప్రభుత్వమే చెల్లించాలని, చనిపోయిన వారికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా సౌకర్యం కల్పించాలని, మొబైల్, సిమ్‌కార్డు రీ చార్జ్‌తో ఇవ్వాలని తదితర డిమాండ్‌లతో సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో మెప్మా ఉద్యోగులు, ఆర్పీలు పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం

నాగులుప్పలపాడు, మే 8 (ఆంధ్రజ్యోతి): ఉప్పు గుండూరు-నీలాయపాలెం గ్రామాల మధ్య వేంచేసిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితులు శిష్టా పాండురంగయ్య ఆధ్వర్యంలో స్వామివార్లకు పూజలు, అభిషేకాలను చేశారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపించారు. అలాగే భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాత్రి కల్యాణ వేంకటేశ్వరుడిని విద్యుత్‌కాంతులతో అలంకరించిన వాహనంపై గ్రామాల్లో ఊరేగించారు.

మోడల్ ఎంసెట్ విజయవంతం

ఒంగోలు విద్య, మే 8 (ఆంధ్రజ్యోతి): రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్(ఆర్ఎస్‌యూ) ఆధ్వర్యంలో గురువారం ఒంగోలులోని ఎస్‌ఆర్‌ఐ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన మోడల్ ఎంసెట్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పరుచూరి అవినాష్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎంసెట్ పరీక్షపై అవగాహన కల్పించేందుకు ఈ మోడల్ ఎంసెట్ నిర్వహించినట్లు తెలిపారు. ఈనెల 10వతేదీ వరకు ప్రతి రోజు ఈ మోడల్ ఎంసెట్ పరీక్ష జరుగుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి శామ్యూల్, మహేష్, ప్రసాద్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రజకులకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలి

పామూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): దేవదాయ, వైద్య, పోలీస్, ఇతర ప్రభుత్వ ప్రవేట్ దోబీ కాంట్రాక్ట్‌లు రజకులకే కేటాయించేలా జీవో నెంబర్ 27 ను వెంటనే అమలుపరచాలని, రజకులకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని టీడీపీ రజక సాధికార సమితి జిల్లా కన్వీనర్ ఆరెకొండ హరి ప్రసాద్ కోరారు. ఒంగోలుకు విచ్చేసిన రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రిని బుధవారం ఆయన మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మాటాడుతూ మున్సిపల్, కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ వ్యాపార సముదాయాల్లో ఐదు శాతం షాపులను రజకులకు కేటాయించేలా జీవో నెంబర్ 18ని, గ్రామ పంచాయతి పరిధిలో ఐదు శాతం షాపులను కేటాయించేలా జీవో నెంబర్ 19 తక్షణమే అమలు చేయా లని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పొదిలి శ్రీను, బాలవెంకటరమణ వీరయ్య, అనిల్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ

ఒంగోలు నగరం, మే 8(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న దివ్యాంగులైన అభ్యర్థులకు ఉచితంగా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు జ.అర్చన ఓ ప్రకటనలో తెలిపారు. ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన దివ్యాంగ అభ్యర్థులు ఈ నెల 11వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణకు ఎండీఎఫ్‌సీ.ఏపీసీఎఫ్‌ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణ విజయవాడలో ఉంటుందని, స్టడీ మెటీరియల్, భోజనం, వసతి ఉచితంగా కల్పిస్తారని పేర్కొన్నారు. 40 శాతం వైకల్యం గల దృష్టిలోపం, అంగవైకల్యం, వినికిడిలోపం ఉన్న వారు ఈ శిక్షణకు అర్హులని, ఎంపిక టెట్ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

నేడు రైజ్‌లో ప్రాంగణ ఎంపికలు

ఒంగోలు విద్య, మే 8 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి గ్రూప్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం వర్చూసా కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు గురువారం తెలిపారు. ఉదయం 9గంటలకు రిజిస్ట్రేషన్ ప్రారంభమవుతుందన్నారు. విద్యార్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, బయోడేటా, ఆధార్, పాన్‌కార్డు, మార్కుల మెమోలతో హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు మద్దిపాడులో అంబేడ్కర్ నాటకం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మద్దిపాడు, మే 8(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులో ఈ నెల 9వ తేదీన డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటకం ప్రదర్శిస్తున్నట్లు కేవీపీఎస్ మండల అధ్యక్షుడు కాకుమాను సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఉబ్బా వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం స్థానిక శ్రీనటరాజ కళాకేంద్రంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. కేవీపీఎస్, అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ సహకారంతో సాయంత్రం 6.30 గంటలకు సంఘం శరణం గచ్ఛామి అనే కళారూపం, నాటక ప్రదర్శన జరుగుతుందని, అభిమానులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, సుందరరావు, నరసింహారావు, వెంకటేశ్వర్లు, షేక్ సుభాని, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగులకు ఉచిత వైద్యసేవలు


వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న డాక్టర్లు

ఒంగోలు కార్పొరేషన్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఉపాస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పోస్టల్ ఉద్యోగులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గురువారం స్థానిక హెడ్ పోస్టాఫీస్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో ఉచిత హెల్త్ స్క్రీనింగ్ క్యాంపు ద్వారా ఉద్యోగులకు బీపీ, షుగర్, బీఎంఐ వైద్య పరీక్షలు నిర్వహించారు. కాగా పలు అనారోగ్య సమస్యలు ఉన్నవారికి వారం రోజులపాటు ఉచిత ఓపీ, ఇతర వైద్య పరీక్షలు ఉపాస్ ఆసుపత్రిలో ఉచితంగా చేస్తామని డాక్టర్ ఉమాపతిచౌదరి తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు ప్రకాష్ చావల, అనీల్‌కుమార్, అనపర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

ఒంగోలు కలెక్టరేట్, మే 8(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సాయిబాబా శత జయంతిని పండుగలా జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య వ్యతిరేకించారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ(హెచ్) పరిధిలో రాజ్యాంగవిరుద్ధమైన చర్యన్నారు. పుట్టపర్తి సాయిబాబా పుట్టిన రోజైన జూన్ 22న ప్రభుత్వ దినంగా జరపాలనుకోవడం తగదని, ఈ నిర్ణయాన్ని వెనుక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎంకే.బేగ్, శిఖా చంద్రశేఖర్, ఉప్పుటూరి ప్రకాశరావు, గుమ్మళ్ళ నరసింహరావు, ఎస్‌వీ.రంగారెడ్డి, ప్రభుదాస్, సుభాని, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపద్దుల కమిటీ సమావేశంలో మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో గురువారం జరిగిన ప్రజాపద్దులకమిటీ సమావేశానికి ఒంగోలు ఎంపీ, కమిటీ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు. కమిటీ చైర్మన్ కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు.

నేడు ఏపీటీఎఫ్ ధర్నా

ఒంగోలు విద్య, మే 8 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సంస్కరణల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ, ఉపాధ్యాయుల పునర్విభజనను వ్యతిరేకిస్తూ చేపట్టిన పోరాట క్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాకా జనార్దన్‌రెడ్డి, డి.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ నాయకులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఉత్సాహంగా శిక్షణ తరగతులు


విద్యార్థులకు కథలను చెప్తున్న అబ్దుల్‌మాలిక్

ఒంగోలు కలెక్టరేట్, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బాలోత్సవంలో భాగంగా ఒంగోలు చిల్డ్రన్ క్లబ్‌లో జరుగుతున్న సమ్మర్ క్యాంపులో గురువారం విద్యార్థులకు పాటలు, కథలు, పొడుపు కథలను నేర్పించారు. జన విజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం కన్వీనర్ అబ్దుల్‌మాలిక్ విద్యార్థులకు కథలు నేర్పించడం చేశారు. కార్యక్రమంలో బాలోత్సవం నాయకులు ఇంద్రజ్యోతి, మ్యాజిక్ రామన్, వీరస్వామి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సురక్షితమైన నీటిని అందించాలి

● నేషనల్ జలజీవన్ మిషన్ డిప్యూటీ సెక్రటరీ అంకిత చక్రవర్తి

ఒంగోలు కలెక్టరేట్, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని నేషనల్ జలజీవన్ మిషన్ డిప్యూటీ సెక్రటరీ అంకిత చక్రవర్తి ఆదేశించారు. జలజీవన్‌మిషన్ పనుల నిర్వహణపై గురువారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జలజీవన్‌మిషన్ ద్వారా ఎంపిక చేసిన పనులను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జలాలు కలుషితం కాకుండా జిల్లాల్లో తాగునీటి సరఫరా మెరుగు పరచాలని చెప్పారు. అందుకు అవసరమైన సహాయ సహకారాలను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నవ శింగరకొండ

● పూర్తిగా మారిపోయిన అంజన్న ఆలయం ● రూ.6.35 కోట్లతో రాతిముఖ మండపం నిర్మాణం


నిర్మాణం పూర్తయిన ప్రసన్నాంజనేయ ఆలయం

●14 నుంచి ప్రత్యేక పూజలు ● దినదిన ప్రవర్ధమానమై అభివృద్ధి చెందిన క్షేత్రం

మహాకుంభాభిషేకం ముహూర్తం ఇదే...

ఈ నెల 19వ తేదీ ఉదయం 9-03 గంటలకు శృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీ స్వామి ఆధ్వర్యంలో మహా కుంభాభిషేకం జరగనుంది. 14 నుంచి 19వ తేదీ వరకు 6 రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమాలకు బాపట్ల జిల్లా, పొరుగున ఉన్న పల్నాడు, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాలతోపాటు తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా పెద్దసంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు.

కొంగొత్తగా ఆలయ రూపురేఖలు

రాతిముఖ మండపం నిర్మాణం నిర్మాణంతో ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. దాతల సహకారంతో నాలుగువైపుల కొత్తగా రాజగోపురాలు, ఆలయ ప్రాకార మండపాలు, డార్మెటరీహాలు, గోశాల నిర్మాణం, కోనేరు నిర్మాణం, విజయగణపతిదేవాలయం, సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం, కల్యాణ మండపం నిర్మాణాలు చేపట్టాల్సి ఉందని ఈవో చెప్పారు.

అంజన్న వెలుగు చూసిందిలా...

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం 150 ఏళ్ల కాలంలో దినదిన ప్రవర్ధమానమై అభివృద్ధి చెందింది. స్వామి పేరిట ఎలాంటి భూములు లేవు. కేవలం దాతలు, భక్తుల నుంచి వచ్చే కానుకలతో దేవాలయం అభివృద్ధి చేశారు.. చేస్తున్నారు. సుమారు 150 సంవత్సరాల క్రితం శింగరకొండ క్షేత్రాధిపతి అయిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ జరిగే సమయంలో కొండ కింద చెట్ల మధ్యలో నుంచి వెలుగు కనిపించింది. భక్తులు వచ్చిచూడగా ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం ఉంది. అప్పటి నుంచి స్వామికి పూజలు చేయటం ప్రారంభించారు.

ఆలయ అభివృద్ధికి అంకురార్పణ ఇలా...

1916 నుంచి 1918 మధ్య కాలంలో భవనాసి చెరువు నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్ తనకు వచ్చిన లాభంలో కొంతభాగం వెచ్చించి దేవాలయ అభివృద్ధి పనులు ప్రారంభించారు. అనంతరం ఆలయం దేవదాయశాఖ పరిధిలోకి చేరింది. అన్ని సామాజిక వర్గాలు అన్నదాన సత్రాలు ఏర్పాటు చేశారు. 70 ఏళ్ల నుంచి ఏటా ఫాల్గుణ శుద్ధత్రయోదశి నుంచి పౌర్ణమి వరకు 3 రోజులపాటు తిరునాళ్ల ఉత్సవాలు నిర్వహిస్తారు.

రూ.6.35 కోట్లతో రాతి ముఖమండపం నిర్మాణం

ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖమండపాన్ని సుమారు 6.35 కోట్ల రూపాయలు(2 కోట్ల రూపాయలు తిరుమల తిరుపతి దేవస్థానం, 2 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం సీజీఎఫ్ నిధులకు తోడు దాతల వద్ద నుంచి 2.35 కోట్ల రూపాయలు) వెచ్చించి రాతి ముఖమండపాన్ని నిర్మించారు. దీని నిర్మాణానికి ఒంగోలు రూరల్ మండలం కరవదికి చెందిన నలమలపు విజయభాస్కరరెడ్డి, శ్రీదేవి దంపతులు, అద్దంకికి చెందిన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కోట శ్రీనివాసకుమార్, నాగలక్ష్మి దంపతులు, శింగరకాయకొండ మండలం చిన్నకనుమళ్లకు చెందిన గుంజి కృష్ణారావు, రమాదేవి, కాట్రగడ్డ అనిల్‌కుమార్, శ్రీవిద్య దంపతులు, తిరుపతి జిల్లా పుత్తూరు సమీపంలోని రాజుకండ్రిక వద్ద గల శ్రీరంగం మిల్క్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీనివాస మిల్క్ నిర్వాహకులు పెద్ద మొత్తంలో విరాళాలు అందజేయగా, సుమారు 120 మంది భక్తులు లక్ష రూపాయల చొప్పున విరాళాలు అందజేశారు. ఇప్పటి వరకు విరాళాలు ఇచ్చిన దాతలతో పాటు ఈ నెల 19వ తేదీ వరకు విరాళాలు ఇచ్చే దాతల పేర్లు రాతి ముఖ మండపంపై ఏర్పాటు చేయనున్నట్లు ఈవో తిమ్మానాయుడు తెలిపారు.


-అద్దంకి, ఆంధ్రజ్యోతి


ఆంజనేయ స్వామి

వైభవంగా శ్రీపద్మావతి గోదాసమేత శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

● కల్యాణ క్రతువును నిర్వహించిన వేదపండితులు
● గోవింద నామస్మరణతో మారుమోగిన దేవాలయ ప్రాంగణం
● వేలాదిగా పాల్గొన్న భక్తులు
● భారీగా అన్నప్రసాద వితరణ


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు(రూరల్), మే8(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం దశరాజుపల్లి రోడ్డులోని లక్ష్మీపురంలో నూతనంగా నిర్మించిన శ్రీపద్మావతి, గోదా సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలను గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అలాగే కలశ, ధ్వజస్తంభంలను ప్రతిష్ఠను వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణ మధ్య చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో సందడి నెలకొంది. అలాగే భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠలో భాగంగా శ్రీపద్మావతి గోదా సమేత శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి కల్యాణం వేదపండితులు వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణం తిలకించటం భక్తులకు ఎంతో పుణ్యప్రదమని పేర్కొన్నారు. భక్తులకు లడ్డూ, ప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా ఆలయ ధర్మకర్త అబ్బూరి చంద్రమౌళి, కార్పొరేటర్ దాచర్ల రమణయ్య, నన్నపనేని ఆంజనేయులు, టీడీపీ నాయకుడు బైరపనేని తిరుపతిరావు, చెన్నరెడ్డి రాంబాబు, కమ్మపాలెం యువత కార్యక్రమాలను పర్యవేక్షించారు.


వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

నిబద్ధత గల నాయకుడు వీరయ్యచౌదరి

● ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్
● సంస్మరణ సభకు భారీగా తరలివచ్చిన టీడీపీ శ్రేణులు
● నివాళులర్పించిన పలువురు నేతలు

నాగులుప్పలపాడు, మే 8 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేత ముప్పవరపు వీరయ్యచౌదరి ఎంతో నిబద్ధత గల నాయకుడని, ఆయన అకాల మరణం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చెప్పారు. టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి దశదినకర్మ గురువారం ఆయన స్వగ్రామం అమ్మనబ్రోలులో జరిగింది. సంస్మరణ సభకు టీడీపీ మండలాధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్ అధ్యక్షత వహించారు. జిల్లా నలుమూలల నుంచి టీడీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, సన్నిహితులు పెద్దఎత్తున తరలివచ్చి వీరయ్యకు నివాళులర్పించారు. ముందుగా వీరయ్యచౌదరి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ వీరయ్య హత్యకు గురికావడం ఎంతగానో కలచివేసిందన్నారు. గ్రామస్థాయి నుంచి ఎదిగి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకొన్న వ్యక్తి వీరయ్య అని, యువగళంలో చురుగ్గా పాల్గొని ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారని కొనియాడారు. వీరయ్య హత్య కేసులో నిందితులను త్వరలో మీడియా ముందు ప్రవేశపెడతామని జిల్లా ఎస్పీ చెప్పారని తెలిపారు. పీడీసీసీ బ్యాంకు చైర్మన్ పదవి వరించే సమయంలోనే వీరయ్య హత్యకావడంతో తమను ఎంతగానో కలచివేసిందన్నారు. ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ వీరయ్య, తాను ఎంతో కలిసిమెలిసి పార్టీ కార్యక్రమాల్లో పనిచేశామన్నారు. ఎన్నికల్లో తనకు భారీ మెజారిటీ అందించడంలో ఎంతో కీలకంగా పనిచేశారని కొనియాడారు. పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవి వీరయ్యకు ఇవ్వాలని తన లేఖతో పాటు వీరయ్యను తీసుకెళ్లి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో వచ్చినట్లు తెలిపారు. 20 సూత్రాలు అమలు చైర్మన్ లంకా దినకర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, ఎంఎం.కొండయ్యయాదవ్, ఏలూరి సాంబశివరావు, దర్శి ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యేలు దివి శివరాం, బాచిన చెంచుగరటయ్య, డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు వీరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించి తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మడి సాయిబాబా, ఇంటూరి శ్రీనివాసరావు, ఈదర వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.


వీరయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్యే శివరాం

జడ్పీ మాజీ చైర్మన్ హరిబాబుకు పరామర్శ

వీరయ్యచౌదరి హత్యకు గురైన నేపథ్యంలో గుండెపోటుకు గురై చికిత్స అనంతరం అమ్మనబ్రోలు చేరుకొన్న ఆయన మేనమామ, జడ్పీ మాజీ చైర్మన్ ఈదర హరిబాబును ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయ్‌కుమార్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, 20 సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో ఈదర మోహన్, రంపతోటి అంకారావు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న బాలాజీ, సత్య


హరిబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి, ఎమ్మెల్యేలు జనార్దన్, బీఎన్, నేతలు దినకర్, శివరాం

పొగాకుకు గిట్టుబాటు ధరల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

రైతులకు మేలు చేస్తాం: కలెక్టర్


వేలానికి ఉంచిన పొగాకు బేళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు రావటమే ప్రభుత్వ లక్ష్యమని, రైతులకు గిట్టుబాటు ధరలు వచ్చే విధంగా చేస్తానని కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. ఒంగోలు నగరం త్రోవగుంట పొగాకు వేలం కేంద్రం 2లో జరుగుతున్న వేలాన్ని కలెక్టర్ గురువారం పరిశీలించారు. ముందుగా ఆమె పొగాకు బేళ్ల తూకం, వేలం, బేళ్లను నిల్వ గూడెంను పరిశీలించారు. ఆ తర్వాత వేలం నిర్వహణాధికారి తులసితో మాట్లాడారు. వేలంలో ఎంతమంది వ్యాపార సంస్థల ప్రతినిధులు పాల్గొంటున్నారు. పొగాకు కాటాలను, గ్రేడ్ల వివరాలను గతేడాదికి ఈ ఏడాదికి ఇదేరోజులకు అమ్మకాలు ఎంతవరకు జరిగిందనే వివరాలు అడిగారు. వేలం నిర్వహణాధికారి తులసి మాట్లాడుతూ ప్రస్తుతం వ్యాపారులు ఎఫ్ 2 గ్రేడ్‌లను కొనుగోలు చేస్తున్నారు.. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నట్లు తెలిపారు. కొనుగోళ్ల వివరాలు ఇవ్వాలని ఆర్ఎం లక్ష్మణరావును కలెక్టర్ ఆదేశించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. పొతవరం రైతు ప్రత్తిపాటి శేషారావు మాట్లాడుతూ నాణ్యమైన పొగాకు మాత్రమే కొంటున్నారని, ధరలుకు కూడా ఇవ్వడం లేదని తెలిపారు. వేలంలో 30శాతం పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరిస్తున్నారన్నారు. వాటిని ఇంటికి తీసుకుపోవటంతో ప్రతి బేలుకు 5కేజీల వరకు తరుగుదల వస్తుందని తెలిపారు. బోర్డు వైస్ చైర్మన్ బొడపాటి బ్రహ్మయ్య, వడ్డెళ్ల ప్రసాదు, రైతు నాయకులు శేషగిరిరావు, బండారు రామాంజనేయులు, బెజవాడ సుబ్బారావు, డోలా సుబ్బారావు పాల్గొన్నారు

సమాచారాన్ని సకాలంలో అందించాలి

ఆర్టీఐపై నిర్వహించిన సమావేశంలో నగర కమిషనర్ వెంకటేశ్వరరావు


మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, పక్కన మేయర్ సుజాత

ఒంగోలు, కార్పొరేషన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలు అడిగిన సమాచారాన్ని నిర్ధిష్ట కాలంలో అందించాలని నగర కమిషనరు కే వెంకటేశ్వరరావు ఆదేశించారు. సమాచార కమిషనర్ ఆదేశాల మేరకు ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయంలో సచివాలయ సెక్రటరీలు, సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. గురువారం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన సదస్సులో కమిషనరు మాట్లాడుతూ అన్నీ విభాగాలలోని అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అర్జీదారులకు తగు సమాచారం అందించాలని, అలాగే సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఆర్టీఐ ద్వారా అర్జీదారులు కోరిన సమాచారాన్ని అందించకుండా, పదేపదే తిప్పించుకోవద్దని తెలిపారు. సమాచార హక్కు చట్టానికి లోబడి అందించాలని చెప్పారు. సదస్సులో మేనేజరు శ్రీహరి పాల్గొన్నారు.

కల్తీపాలు తయారీదారులపై చర్యలు తీసుకుంటాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దర్శి, మే 8(ఆంధ్రజ్యోతి): కల్తీపాలు తయారుచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఆహార భద్రతా అధికారి ఎం.వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముమ్మర తనిఖీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 'పాపాల భైరవులు, దర్శి ప్రాంతంలో విచ్చలవిడిగా కల్తీపాలు తయారీ' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గతంలో పలుచోట్ల తనిఖీలు చేసి 220 శ్యాంపిల్స్ ల్యాబ్‌కు పంపినట్టు తెలిపారు. అందులో 30 పాల శ్యాంపిల్స్ కల్తీ పాలుగా నిర్ధారణ అయినట్టు వెంకటేశ్వరరావు వివరించారు. ఇంకా కొన్ని రిపోర్టులు అందాల్సి ఉందన్నారు. ఇక నుంచి విస్తృతంగా తనిఖీలు నిర్వహించి కల్తీ పాల తయారీని పూర్తిగా అరికడతామని ఆయన పేర్కొన్నారు.

వైభవంగా సత్యదేవుని కల్యాణం


ప్రత్యేక అలంకరణలో రమా సహిత సత్యదేవుడు

మార్కాపురం వన్‌టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలోని 9వ వార్డులోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు రెంటచింతల గౌరిశంకర శర్మ సత్యనారాయణస్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై రమా సహిత స్వామి ఉత్సవమూర్తులకు పట్టు వస్త్రాలు, వివిధ పూలమాలలు, బంగారు, వెండి ఆభరణాలతో అలంకరించారు. కల్యాణ ఘట్టాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించి తరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బాసాని సుధాకర్, ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాసులు, డి.కోటేశ్వరరావు, కార్యదర్శి ముత్తంశెట్టి చిన్నసుబ్బారావు, సహాయ కార్యదర్శులు నూనె రామిరెడ్డి, బాసాని ఉమా, కోశాధికారి కేవీ సుధాకర్‌రావు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

నాయుడుపల్లె కాలనీలో మంచి నీటి సమస్య

» డీప్ బోరుకు తరచూ మరమ్మతులు

» శాశ్వత పరిష్కారం చూపని అధికారులు



తోపుడు బండిపై నీరు తెచ్చుకుంటున్న కాలనీ వాసులు

మోటర్‌సైకిల్‌పై నీరు తెచ్చుకుంటున్న స్థానికుడు

తర్లుపాడు, మే 8 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడు పంచాయతీ రైల్వే గేటు వద్ద నున్న బీసీ, నాయుడుపల్లె కాలనీలలో గత వారం రోజుల నుంచి తీవ్ర మంచి నీటి సమస్య నెలకొంది. ఈ రెండు కాలనీలకు నీరు సరఫరా చేసే డీప్ బోరు మరమ్మతులకు గురికావడంతో ఈ కాలనీలలో మంచినీటి సమస్య ఏర్పడింది. కాలనీల వాసులు విధిలేని పరిస్థితుల్లో తర్లుపాడు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న చిన్న ట్యాంకు వద్ద నుంచి సైకిల్స్, బైకులు, ఆటోలు, తోపుడు బండ్లలో నీరు తెచ్చు కుంటున్నారు. ఎక్కువ పశువులు ఉన్నవారు మంచినీటి ట్యాంకర్ ద్వారా నీరు కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కాలనీలలో నెలకు వారం రోజుల పాటు ఈ పరిస్థితి నెలకొంది. అధికారుల కు చెప్పనప్పటికీ తూతూమంత్రంగా మరమ్మతులు చేయడంతో మళ్లీ బోరు పాడైపోతోందని స్థానికులు చెప్తున్నారు. అధికారులు సమస్యను పరిష్కరించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని వారు కోరుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల నిరసన

కంభం, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్న పాలకుల విధానాలను వ్యతిరేకిస్తూ శుక్రవారం ఒంగోలులో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు పగడాల పాండు, అబ్దుల్‌కలాం, రంగస్వామి, మల్లికార్జునరావు, భాస్కర్‌నాయుడు, అంకిరెడ్డి పాల్గొన్నారు.

పీఆర్ రోడ్లను అభివృద్ధి చేయాలి


జడ్పీ సీఈవోను కలిసిన బీజేపీ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో పంచాయతీ రాజ్ రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, వాటిని వెంటనే అభివృద్ధి చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు జడ్పీ సీఈవో చిరంజీవికి విజ్ఞప్తి చేశారు. స్థానిక పంచాయతీ రాజ్ అతిథి గృహంలో ఆయన సీఈవోను కలిసి పంచాయతీ రాజ్ నిధులతో నియోజకవర్గంలోని గ్రామాలలో రోడ్లు వేసి అభివృద్ధి చేయాలన్నారు. వివిధ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొంతల కృష్ణ, శాసనాల సరోజిని, మద్దెల లక్ష్మీ, ప్రవీణ్ పాల్గొన్నారు.

కంభం విద్యార్థులకు ప్రతిభ పురస్కారం


సతీష్ అగస్టీన్

కంభం, మే 8 (ఆంధ్రజ్యోతి) : కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులుగా ఇంటర్ విద్యను అభ్యసిస్తూ కంభం ప్రభుత్వ ఎస్సీ హాస్టల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులకు పరీక్ష ఫలితాలలో ప్రతిభను చూపి రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ప్రకటించిన ప్రతిభ పురస్కారాలను అందుకున్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం హెచ్‌ఈసీకి చెందిన బి.సతీష్ 929/1000 మార్కులు, వి.అగస్టీన్ 914/1000 మార్కులు సాధించి ప్రతిభ పురస్కారానికి ఎంపికైన బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాశాలలో మంత్రులు డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి, సంధ్యారాణి చేతుల మీదుగా పతకం, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వారిని ఇంటర్ బోర్డు ఆర్ఐవో, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సైమన్‌విక్టర్, ఎస్సీహాస్టల్ అధికారి ఐ.రామ్‌నాయక్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఈదరను పరామర్శించిన నేతలు

కంభం, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన ప్రకాశం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబును కంభం జడ్పీటీసీ మాజీ సభ్యుడు గోగులదిన్నె జయసింహారెడ్డి, సయ్యద్ జాకీర్‌హుస్సేన్ గురువారం పరామర్శించారు. ఇటీవల మృతిచెందిన నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ వీరయ్యచౌదరి పెద్దకర్మకు హాజరై జయసింహారెడ్డి, జాకీర్‌హుస్సేన్ నివాళులర్పించారు. అనంతరం హరిబాబును పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి

బేస్తవారపేట, మే 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అమ్మవారిశాల బజార్‌లో ఇంటిలోని మోటార్‌కు చెందిన వైర్ తగిలి వివాహిత ఆవులమంద చందు(31) మృతి చెందారు. ఎస్సై రవీంద్రారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. వారి గృహంలో పంచాయతీ కొళాయి నుంచి విద్యుత్ మోటార్ ద్వారా నీరు పట్టుకుంటుండుండగా వైరు తగిలి కేకలు వేయడంతో సమీపంలోని వారు వచ్చి కర్రతో వైరును తొలగించారు. వెంటనే కంభం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెల్చారు. చందుకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువు కట్టపై కారు - ఆటో ఢీ

ముగ్గురికి గాయాలు

మార్కాపురం రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం చెరువు కట్ట రోడ్డుపై కారు-ఆటో ఎదురుపడి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ముగ్గురు గాయపడిన ఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. పట్టణం నుంచి ఆటో ముగ్గురు ప్రయాణికులతో రైల్వే స్టేషన్‌కు వెళ్తుంది. ఒంగోలు నుంచి పేపర్ కారు మార్కాపురం వస్తోంది. మార్కాపురం పట్టణ సమీపంలోని చెరువు కట్టపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న పానకాల సాయితేజకు ఆటోలో ప్రయాణిస్తున్న వెంకటరామమ్మ, డీ సూర్యప్రతాపరెడ్డికి గాయాలయ్యాయి. వారికి ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. పోలీసులు వివరాలను సేకరించారు.

పాఠశాల సంసిద్ధత ర్యాలీ

ఎర్రగొండపాలెం, మే 8 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకం మండల విద్యా వనరుల కేంద్రం పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో పాఠశాల సంసిద్ధత ఉత్సవ ర్యాలీని గురువారం అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు నిర్వహించారు. త్రిపురాంతకంలోని ప్రధాన వీధుల్లో సాగిన ర్యాలీలో సీడీపీవో పద్మావతి, సూపర్‌వైజర్లు హైమావతి, మరియకుమారి, ఎంపీడీవో, ఎంఈవో, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో 3 సంవత్సరాలు పూర్తి అయిన పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేరేలా నమోదు చేశారు.

పెండింగ్ ఫైల్స్ లేకుండా చూడాలి

ఎర్రగొండపాలెం రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో అందజేసే ప్రతి అర్జీని వెంటనే పరిష్కరించి, పెండింగ్ ఫైల్స్ లేకుండా చూడాలని వీఆర్వోలు, సిబ్బందికి తహసీల్దార్ దుంప మంజునాథరెడ్డి సూచించారు. గురువారం కార్యాలయంలో వీర్వోలు, డిజిటల్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన ఇన్‌కం, కుల ధ్రువీకరణ పత్రాలను వెనువెంటనే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేవారికి అర్హత ఉంటే వెంటనే మంజూరుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో డీటీ, వీఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మంజునాథ్‌రెడ్డి

గ్రంథాలయాలు విజ్ఞాన బాంఢాగారాలు

గిద్దలూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని, ఖాళీ సమయాలలో గ్రంథాలయాలకు వెళ్లి విజ్ఞానాన్ని పెంచుకోవాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ మొర్రి పిచ్చయ్యయాదవ్ విద్యార్థులకు సూచించారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గ్రంథాలయంలో జరుగుతున్న కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మేథస్సును పెంచుకునేందుకు వేసవి శిక్షణ తరగతులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సెలవుల్లోనే కాకుండా మామూలు రోజుల్లో కూడా ఖాళీ సమయాలలో కొంత ఆటపాటలకు, గ్రంథాల్లో పుస్తకపఠనానికి వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, రిటైర్డ్ హెచ్‌ఎం రామిరెడ్డి, పారాలీగల్ వలంటీర్ మధుసూదన్‌రావు, ఫ్యాకల్టీ శివప్రసాద్, యువ ప్రగతి పథం సంస్థ వ్యవస్థాపకుడు ఫరూఖ్ పాల్గొన్నారు.

బేస్తవారపేట : వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం విద్యార్థులకు బ్లడ్ గ్రూప్, బ్లడ్ ఇచ్చినందు వల్ల కలిగే ఆరోగ్య లాభాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం స్వాతంత్ర సమరయోధుల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన ఉండాలి

పెద్దారవీడు : విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన ఉండాలని వైద్యాధికారి గౌతమి అన్నారు. గ్రంథాలయంలో విద్యార్థులకు జరుగుతున్న వేసవి శిక్షణ తరగతుల్లో గురువారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు దంత సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై చిన్నప్పటి నుంచే తెలియజేయాలన్నారు. గ్రంథపాలకుడు వై.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గ్రహణంమొర్రికి ఉచిత శస్త్ర చికిత్స

మార్కాపురం రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : సర్వజన వైద్యశాలలో గ్రహణంమొర్రితో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా శస్త్ర చికిత్స చేయనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ రామచంద్రారావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కాపురం సర్వజన వైద్యశాలలోని జిల్లా ఇంటర్వెన్షన్ సెంటర్‌లో పిన్నమనేని సిద్ధార్థ కాలేజీ స్మైల్ ట్రైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రహణం మొర్రి ఉన్న చిన్నారులకు ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించారు. వారిలో 13 మంది చిన్నారులకు ఉచితంగా శస్త్ర కిత్స చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కోటేశ్వరరావు, శ్రీకాంత్, డీఈఐసీ, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది, వైద్య సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శేషశయనారెడ్డి

గిద్దలూరు టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పాలుగుళ్ల నాగశేషశయనారెడ్డి (బాబు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం బార్ అసోసియేషన్ ఎన్నికలు జరుగగా అధ్యక్షుడిగా శేషశయనారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆవులమంద తిరుమలప్రసాద్, కోశాధికారిగా ముత్తుముల రంగారెడ్డి, ఉప కార్యదర్శిగా మోడి పిచ్చయ్య, లైబ్రేరియన్‌గా ఎం.రైడర్ బాబు, స్పోర్ట్స్ కల్చరల్ కార్యదర్శిగా పాలుగుళ్ల విజయ్‌కుమార్‌రెడ్డి, మహిళా కార్యదర్శిగా బుసా సంధ్యారాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగగా, మల్లికార్జున్‌పై బొడ్డు ప్రకాశ్ గెలుపొందారు. ఎన్నికల అధికారిగా పిడతల రాజశేఖర్‌రెడ్డి వ్యవహరించారు.

విశ్రాంత ఎస్ఐ సిలార్ బాషా మృతి

కంభం, మే 8 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన రిటైర్డ్ ఎస్ఐ షేక్ సిలార్ బాషా (72) గురువారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయన కందులాపురంలోని హజరత్‌బిలాల్ మసీద్‌కు గౌరవాధ్యక్షుడిగా వ్యవహరిసున్నారు. శుక్రవారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

ఆపరేషన్ సింధూర్‌పై హర్షం

దేశభద్రత రంగంలో గొప్ప మైలురాయి

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి


కంభంలో హర్షం వ్యక్తం చేస్తున్న మాజీ సైనికులు

గిద్దలూరు టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్ విజయం దేశ భద్రత రంగంలో ఒక గొప్ప మైలురాయిగా నిలిచిందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉగ్రవాదుల అణచివేతలో భారత సైన్యం ప్రదర్శించిన వ్యూహాత్మక ధైర్యసాహసాలు ప్రశంశనీయమని కొనియాడారు. ఈవిజయంతో దేశ శత్రువులకు గట్టి బుద్ధి చెప్పగలిగామన్నారు. భారత భద్రత దళాల శౌర్యం ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేసిందన్నారు. ప్రధాన మంత్రి మోదీ దూరదృష్టి, రక్షణశాఖ సమర్థత, భద్రత వ్యవస్థల సమన్వయం ప్రధాన కారణమని పేర్కొన్నారు. దేశభద్రతకు మార్గదర్శకులుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో దేశ సైనిక రంగంలో మహిళల కీలక పాత్రను గర్వకారణంగా గుర్తించాలని, ఈకీలక చర్యల్లో ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్ సోఫియా ఖురేషీ, భారత వైమానిక దళానికి చెందిన వింగ్ కమాండర్ వ్యోమికాసింగ్ సమర్థత, నేతృత్వం, నిబద్ధత అత్యంత ప్రశంశనీయమని పేర్కొన్నారు. వీరి ధైర్యసాహసాలు భారతసైన్యంలో నూతనతరం మహిళలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. గిద్దలూరు నియోజకవర్గానికి చెందిన అనేక మంది యువకులు భారత సైన్యంలో సేవలందిస్తూ దేశరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్నారని, వారి ధైర్యం, దేశభక్తి, త్యాగ స్వభావం ఆదర్శప్రాయమన్నారు. ప్రతి సైనికుడికీ, అధికారికీ హృదయపూర్వక అభినందనలు తెలియచేస్తూ దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే వీరులకు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి వినమ్ర వందనాలు అర్పించారు.

కంభం : పాకిస్థాన్‌లో ఉగ్రవాదుల స్థావరాలపై ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంపై కంభం మాజీ సైనికుల సంఘం అభినందనలు తెలిపింది. ఉగ్రవాదుల స్థావరాలను ధ్వం సం చేసినందుకు మాజీ సైనికులు హర్షం వ్యక్తం చేశారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు మతం ఆధారంగా కుట్రలు పన్ని హిందుస్థాన్‌లో మతాల మధ్య చిచ్చురేపాలని చూసిందన్నారు. ఆపరేషన్ సిం దూర్ విజయవంతం చేసినందుకు ప్రధాని మోదీకి మాజీసైనికులు అభినందనలు తెలిపారు.

గిద్దలూరు : ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడం పట్ల మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అమాయకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులపై, వారి స్థావరాలపై విజయవంతంగా దాడులు నిర్వహించి బుద్ధి చెప్పారని అభినందించారు. దేశం కోసం పోరాడుతున్న ఇండియన్ ఆర్మీకి, సైన్యానికి ప్రతి ఒక్కరూ తోడుగా, అండగా నిలువాలని కోరారు.

బీసీల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న రాష్ట్ర వాషర్‌మెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి

మార్కాపురం వన్‌టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : బీసీల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని రాష్ట్ర వాషర్‌మెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్ సావిత్రి చెప్పారు. స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో రజకులు, రజక ఉద్యోగుల సమావేశంలో గురువారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీవో నెం.27 ప్రకారం ప్రభుత్వ వైద్యశాలల్లో, వివిధ శాఖల్లో దోబీ పోస్టులు రజకులకే ఇవ్వాలని చెప్పారు. దోబీలకు సంబంధించిన వివిధ కాంట్రాక్టులు కూడా వారికే ఇవ్వాలన్నారు. జీవో నెం.18 ప్రకారం మున్సిపాలిటీలు, 19 ప్రకారం పంచాయతీలలోని వాణిజ్య సముదాయాలలో 5 శాతం దుకాణాలు రజకులకే కేటాయించాలని చెప్పారు. రజకులకు ఐక్యంగా ఉండి అభివృద్ధికి సహకరించుకోవాలని, అప్పుడే ఆర్థికంగా, రాజకీయంగా రాణించగలరని సూచించారు. మానిటరింగ్ కమిటీతో రజకుల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. మార్కాపురం నియోజకవర్గంలోని రజకుల సమస్యలు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అనంతరం రజక సంఘ నాయకులు, ఉద్యోగులు సావిత్రిని సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి కనిగిరి బాలవెంకటరమణ, రజక సంఘం పట్టణ అధ్యక్షుడు తుంబేటి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి పెండ్యాల నారాయణ, రాష్ట్ర నాయకులు తిరుపతయ్య, రజక ఉద్యోగ సంఘం అధ్యక్షుడు పేరూరి వెంకటేశ్వర్లు, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వక్కలగడ్డ మల్లికార్జునరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

గిద్దలూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల పోలీసులు వాహన తనిఖీ కార్యక్రమం చేపట్టారు. ఎస్సై కోటేశ్వరరావు, పోలీసులు వాహనాలను ఆపి ధ్రువపత్రాలను పరిశీలించారు. లైసెన్సు లేకుండా, హెల్మెట్, వాహన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరిస్తే ప్రాణాలకు రక్షణ ఉంటుందన్నారు.

పొగాకు రైతులకు మెరుగైన ధర కల్పిస్తాం

పొగాకు బోర్డు ఈడీ విశ్వశ్రీ


వ్యాపారులతో మాట్లాడుతున్న ఈడీ విశ్వశ్రీ

పొదిలి, మే 8 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులకు మెరుగైన ధర కల్పించి, సకాలంలో అమ్మకాలు పూర్తి చేయించడానికి బోర్డు కృషి చేస్తుందని పొగాకు బోర్డు ఈడీ విశ్వశ్రీ అన్నారు. గురువారం పొదిలి వేలం కేంద్రాన్ని సందర్శించిన ఆమె పొగాకు బోర్డు రైతులు, వ్యాపారులతో సమావేశమై మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్రంలో 160 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి లక్ష్యంగా కాగా, సుమారు 220 మిలియన్ కిలోలు రావచ్చని అంచనా వేస్తున్నామన్నారు. ధరల విషయమై వ్యాపారులతో సంప్రదింపులు చేస్తున్నామన్నారు. వ్యాపారులకు ఆర్డర్లు ఖరారు కావడానికి ఈ నెల మూడవ వారం వరకు సమయం పడుతుందని చెప్తున్నారన్నారు. వాళ్లకు ఆర్డర్లు ఖరారైతే అన్ని రకాల బేళ్లను కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. అప్పటి వరకు కంపెనీలు కొన్ని రకాల బేళ్లను కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. అప్పటి వరకు కంపెనీలు కొన్ని రకాల బేళ్లను మాత్రమే కొనుగోలు చేయడం వలన తిరస్కరణ బేళ్లు ఎక్కువ అవుతున్నాయన్నారు. రానున్న 15 రోజులు పాటు నోబిడ్ బేళ్లను తగ్గించాలని వ్యాపారులను సూచించినట్లు చెప్పా రు. రైతులు మార్కెట్‌లో ఏ రకం పొగాకును వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారో ఆ రకం బేళ్లను తెచ్చుకోవటం వలన అధనపు ఖర్చులు తగ్గుతాయన్నారు. గత ఏడాది అమ్మకాలు పూర్తయ్యేసరికి సరాసరి ధర రూ.230 వరకు వచ్చిందని ఈ ఏడాది ఇప్పటి వరకు సరాసరి ధర రూ. 30 అధనంగానే ఉందన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఇప్పటి వరకు ధరలు తగ్గలేదన్నారు. కంపెనీలకు ఆర్డర్లు ఖరారైతే ధరలు పెరుగుతాయని ఆశిస్తున్నామన్నారు. తద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు. గతంలో రోజుకు మూడు మిలియన్ కిలోలు అమ్మకాలు జరిగేవని, పది రోజుల నుంచి రోజుకు ఆరు మిలియన్ కిలోల వరకు అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. రైతులు ఎక్కువ మొత్తంలో పంట పండించినప్పటికీ అక్టోబరు నాటికి అమ్మకాలు పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. కర్నాటకలో ఒక నెల ఆలశ్యంగా అమ్మకాలు పూర్తయినందున ఆంధ్రలో పూర్తి స్థాయిలో వ్యాపారులు, డీలర్లు రావడానికి నెల రోజులు సమయం పట్టిందని చెప్పారు. ముందుగా వేలం కేంద్రం నిర్వాహణాధికారి గిరిరాజ్‌కుమార్‌తో ఈడీ మాట్లాడారు. ఆమె వెంట బోర్డు అధికారి వేణుగోపాల్, ఒంగోలు ఆర్‌ఎం లక్ష్మణరావు, సిబ్బంది ఉన్నారు.

ఆర్థిక వ్యవహారాలు, ఆన్‌లైన్ నమోదుపై వీవోఏలకు శిక్షణ

దొనకొండ, మే 8(ఆంధ్రజ్యోతి): పొదుపు గ్రూపులకు చెందిన ఆర్థిక లావాదేవీలు, ఆన్‌లైన్ యాప్‌లలో నమోదు తదితర అంశాలపై స్థానిక వెలుగు కార్యాలయంలో వీవోఏలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏపీఎం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. దర్శి ఏరియా కోఆర్డినేటర్ వి.వసుంధరాదేవి ముఖ్యఅతిథిగా, ఈఎంటీలుగా సత్యసాయి జిల్లాకు చెందిన ఈశ్వరమ్మ, తిరుపతి జిల్లాకు చెందిన ముబీనాలు వ్యవహరించారు. వీవోఏలు, ఎంఎస్‌లు ఆర్థిక వ్యవహారాల్లో, ఆన్‌లైన్ లావాదేవీల్లో డేటా ఎంట్రీ ఎలా చేయాలి, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. గత మార్చి 31 నాటికి పొదుపు సంఘాల్లో ఆర్థిక లావాదేవీలకు చెందిన నిల్వల లెక్కలు తేల్చుకొని యాప్‌లో ఎలా నమోదు ఎలా చేయాలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎంలు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి

పామూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): పామూరు, సీఎస్‌పురం మండలాల్లో విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ పాఠశాలల్లో ఉచితంగా కల్పించే ప్రవేశాలకు తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈనెల 19లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఒకటో తరగతిలో ప్రవేశం కోసం 2019 జూన్ 2 నుంచి 2020 మే 31లోగా జన్మించి పిల్లలు అర్హులన్నారు. పామూరు, సీఎస్‌పురం మండలాల్లో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో చేరేందుకు ఆయా పాఠశాలలకు కిలో మీటరు నుంచి 3 కిలో మీటరు లోపు దూరంలో ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఈఅవకాశాన్ని పేద కుటుంబాలకు చెందిన వారు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

రేపటి నుంచి దేవస్థాన వార్షికోత్సవం

పామూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సట్టుమడుగులో వెలసియున్న శ్రీపార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి దేవస్థాన వార్షికోత్సవ వేడుకలను ఈనెల 10వ తేది నుంచి మూడు రోజుల పాటు జరుపుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు. శనివారం రాత్రి పాటక చేరి, ఆదివారం స్వామివార్లకు విశేష అభిషేకాలు, సోమవారం శివపార్వతుల శాంతి కల్యాణం జరుగుతుంది. ఈసందర్భంగా భక్తులకు అన్నదానం, గ్రామోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

డిజిటల్ అసిస్టెంట్లు లేక ప్రజల ఇబ్బందులు

వెలిగండ్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో పూర్తిస్థాయిలో డిజిటల్ అసిస్టెంట్లు లేక పోవడంతో పౌర సేవలు సక్రమంగా అందడంలేదు. వెలిగండ్ల మండలంలో 12 సచివాలయాల్లో ఏడుగురు డిజిటల్ అసిస్టెంట్లు ఉన్నారు. వెలిగండ్ల గ్రామ సచివాలయంలో 8 నెలల నుంచి డిజిటల్ అసిస్టెంట్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు, సభ్యుల చేర్పులకు ఆవకాశం ఇవ్వడంతో ప్రజలు సచివాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు కూడా పొందలేకపోతున్నారు. రైతులు 1బి, అడంగల్ కాపీ సచివాలయంలో పొందాలంటే కష్టతరమవుతుంది. దీంతో ప్రజలు సుదూర ప్రాంతాల్లో ఉన్న సచివాలయాలకు వెళుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీలను భర్తీచేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

పామూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : యద్ధ సమయంలో ప్రజలు అధైర్యపడవద్దని, పోలీసులు అన్నివిధాలా అండగా ఉంటారని సీఐ ఎం.భీమానాయక్ అన్నారు. జిల్లా ఎస్పీ, కనిగిరి డీఎస్పీ ఆదేశాల మెరకు పట్టణంలోని స్థానిక మమ్మీ డాడి సెంటర్‌లో గురువారం రాత్రి స్థానిక పోలీసులతో కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధవాతావరణం ఏర్పడిన దృష్ట్యా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈసందర్భంగా వాహనాలు, లాడ్జిలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పామూరు, సీఎస్‌పురం ఎస్‌ఐలు టి కిశోర్‌బాబు, ఆర్ సమన్‌లతో పాటు స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు డీఎస్సీకి ప్రత్యేక శిక్షణ

ఒంగోలు నగరం, మే 8(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న దివ్యాంగ అభ్యర్థులకు ఉచితంగా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు జి.అర్చన ఓ ప్రకటనలో తెలిపారు. ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన దివ్యాంగ అభ్యర్థులు ఈ నెల 11వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణకు ఎండీఎఫ్‌సీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణ విజయవాడలో ఉంటుందని, స్టడీ మెటీరియల్, భోజనం, వసతి ఉచితంగా కల్పిస్తారని పేర్కొన్నారు. 40 శాతం వైకల్యం గల దృష్టిలోపం, అంగవైకల్యం, వినికిడి లోపం ఉన్న వారు ఈ శిక్షణకు అర్హులని, ఎంపికను టెట్ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు

- పొంచిఉన్న ప్రమాదాలు
- చర్యలు తీసుకోకపోతే ప్రాణనష్టం జరిగే అవకాశం

దర్శి, మే 8(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో పలు ప్రభుత్వ భవనాలు శిథిలమై కూలేదశకు చేరాయి. ఆ భవనాలు కూలితే ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉంది. ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద ఉన్న పాత కోర్టు భవనం 1908 సంవత్సరంలో నిర్మించారు. సుమారు 117 సంవత్సరాలు క్రితం నిర్మించిన ఈ భవనం 30ఏళ్ల క్రితం పైకప్పు దెబ్బతిని భవనం కారుతుంది. భవనం ఎప్పుడైనా కూలుతుందనే ఉద్దేశంతో నూతన కోర్టు భవనాలు నిర్మించారు. సుమారు 20 ఏళ్ల క్రితమే నూతన భవనాల నుంచి కోర్టు విధులు నిర్వహిస్తున్నారు. పాత కోర్టు భవనాన్ని కొంతకాలం తహసీల్దార్ కార్యాలయంగా ఉపయోగించారు. నూతన తహసీల్దార్ కార్యాలయ భవనం నిర్మించిన తర్వాత ఈ భవనం ఖాళీగా ఉంది. ప్రస్తుతం రెవెన్యూ రికార్డులు పాత భవనంలోనే ఉంచారు. ఈప్రాంతంలో తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, సబ్‌ట్రెజరీ, సబ్ జైలు, వీర్వోల భవనాలు ఉన్నాయి. నిత్యం వివిధ పనుల కోసం వందలాది మంది ఇక్కడకు చేరుకుంటారు. బ్రిటీష్‌కాలంలో పెంచిన వేపచెట్లు ఉండటంతో పాత భవనం చుట్టూ కూర్చుని ప్రజలు పిచ్చాపాటిగా మాట్లాడుకుంటుంటారు. సుమారు 117 సంవత్సరాల క్రితం నిర్మించిన భవనం గోడల్లో సామర్థ్యం కూడా పూర్తిగా దెబ్బతింది. సున్నపు పెచ్చులు లేచి పడుతున్నాయి. దీంతో ఆ భవనం ఎప్పుడైనా కూలే ప్రమాదం ఉంది. ఈ భవనం కూలితే ప్రాణనష్టం జరిగే అవకాశాలు ఉన్నాయి. భవనాన్ని కూల్చటమో లేక ఆ పరిసరాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అలాగే, మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్మించిన ఎమ్మార్సీ భవనం కూలేదశకు చేరింది. ఈ భవన నిర్మాణం నాసిరకంగా జరగటంతో నిర్మించిన 20 ఏళ్లకే దెబ్బతింది. తొలుత విద్యాశాఖ విధులు నిర్వహించిన అధికారులు భవనం కూలుతుందనే ఉద్దేశంతో ఇతర భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ భవనం కూడా ఖాళీగా ఉంది. గోడలు నెర్రలిచ్చి శిథిలావస్థకు చేరింది. ఏనిమిషంలోనైనా కూలే ప్రమాదం ఉండటంతో ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. ఈ భవనాన్ని కూల్చి వేసేందుకు ఉన్నతాధికారుల అనుమతుల కోసం స్థానిక అధికారులు నివేధికలు పంపారు. ఉన్నతాధికారులు స్పందించకపోవటంతో భవనాన్ని కూల్చలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


కూలేదశలో బ్రిటీష్‌కాలంలో నిర్మించిన కోర్టు భవనం


శిథిలమవుతున్న ఎమ్మార్సీ భవనం

గడువులోగా సబ్‌స్టేషన్‌ను పూర్తిచేయాలి

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశం

తాళ్లూరు, మే 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను గడువులోగా పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశించారు. ఇందుకోసం మండలంలోని శివరాంపురం గ్రామశివారున సబ్ స్టేషన్ నిర్మాణానికి కేటాయించిన ప్రభుత్వ భూమిని గురువారం ఆయన పరిశీలించారు. తూర్పుగంగవరం- చీమకుర్తి వెళ్లే మార్గంలో సర్వే నంబర్లు 307/3లో 0.51సెంట్లు, 307/5లో 3.13 ఎకరాలు మొత్తం 5.64 ఎకరాలు కేటాయించారు. గత టీడీపీ ప్రభుత్వంలో 2018లో నిధులు మంజూరయినా నిర్మాణ పనులు చేపట్టలేదు. తిరిగి కూటమి ప్రభుత్వం రాగానే నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ మంత్రి గొట్టిపాటి రవికుమార్ త్వరితగతిన పనులు పూర్తిచేయాలని సూచించారన్నారు. విద్యుత్ అధికారుల పర్యవేక్షణలో ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. 132/కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే మూడు మండలాలకు చెందిన 60 గ్రామాల ప్రజలు, రైతుల విద్యుత్ కష్టాలు తీరుతాయన్నారు. శివరాంపురం గ్రామసర్వే నంబర్‌లో సబ్‌స్టేషన్ నిర్మిస్తూ తూర్పుగంగవరం సబ్‌స్టేషన్‌గా మంజూరు చేయటం పట్ల ఆ గ్రామానికి చెందిన మన్నం రామకోటయ్య, మారిశెట్టి హనుమంతరావు తదితరులు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. ఈవిషయమై జేసీ విద్యుత్ అధికారులతో మాట్లాడగా గత టీడీపీ ప్రభుత్వం 2018లో తూర్పుగంగవరం వద్ద మంజూరు చేయగా, తదుపరి ప్రభుత్వం శివరాంపురం వద్ద స్థలాన్ని సమీకరించి నిర్మాణం చేపట్టారని తెలిపారు. శివరాంపురం గ్రామస్తుల విన్నపం మేరకు ఆగ్రామపేరును కూడా విద్యుత్ సబ్‌స్టేషన్‌కు పెట్టేలా సంబంధిత అధికారులతో మాట్లాడతానని జేసీ గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

పొరపాట్లు లేకుండా రీసర్వే చేయాలి

బెల్లంకొండవారిపాలెం గ్రామ వద్ద జరుగుతున్న రీసర్వే పనులను జేసీ గోపాలకృష్ణ పరిశీలించారు. రికార్డుల్లో ఉన్న గ్రామ విస్తీర్ణానికి, క్షేత్రస్థాయిలో ఉన్న భూమి సరిపోయిందా, లేదా అడిగి తెలుసుకున్నారు. రైతుల సమక్షంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా రీసర్వే జరపాలన్నారు. ముందుగా ప్రభుత్వభూములను, తదుపరి పట్టా భూములను కొలిచి ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. పొరపాట్లు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తూర్పుగంగవరం శివారులో మల్లికార్జున రైస్ మిల్లును జేసీ తనిఖీ చేశారు. మిల్లులో ఉన్న బియ్యాన్ని పరిశీలించారు. అమ్మకానికి సిద్ధం చేసిన బస్తాలోని బియ్యాన్ని పరిశీలించి, శ్యాంపిల్స్‌ను పరిశీలనకు పంపాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

ప్రభుత్వ భూమిలో గుడిసెలను తొలగించాలి

132/33 కేవీ సబ్‌స్టేషన్‌కు పక్కనేఉన్న పశువుల మేత పోరంబోకు భూమిలో సంచారజాతుల వారు తాత్కాలిక పూరిగుడిసెలు వేసుకుని ఆక్రమించుకున్నారని శివరాంపురం గ్రామస్థులు జేసీ గోపాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. గుడిసెల్లో నివాసం ఉండకుండా ఎక్కడెక్కడో వుంటున్నారని తెలిపారు. దీనివల్ల పశువుల మేతకు ఇబ్బందిగా ఉందని విన్నవించారు. జేసీ స్పందిస్తూ ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదన్నారు. తక్షణమే ఖాళీ చేయించాలని తహసీల్దార్ సంజీవరావు, వీఆర్వో చంద్రశేఖర్‌రావును ఆదేశించారు. ఆస్థలంలోని ఆక్రమణలను పది రోజుల్లో ఖాళీ చేయించకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామస్థులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని జేసీ తెలిపారు.

కార్యక్రమంలో తహసీల్దార్ కె.సంజీవరావు, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, విద్యుత్ ఈఈ కృష్ణారెడ్డి, ఏడీఈ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.


బెల్లంకొండవారిపాలెం వద్ద జరుగుతున్న రీసర్వేను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ


రైస్‌మిల్లులో బియ్యాన్ని పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించొద్దు!

- ఎస్‌ఐ కమలాకర్

ముండ్లమూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులకు చిరు వ్యాపారులు ఎలాంటి ఆటంకాలు కలిగించవద్దని ఎస్‌ఐ కె.కమలాకర్ పేర్కొన్నారు. అలాచేస్తే దుకాణదారులపై కేసులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం సాయంత్రం మారెళ్ల గ్రామంలోని బస్టాండ్ సెంటర్‌లో దుకాణదారులు, గ్రామస్థులతో మాట్లాడారు. దుకాణాలముందు నిర్వాహకులు వాహనాలు నిలబెట్టడం వల్ల వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దుకాణదారులు తమ వాహనాలను ఇళ్ల వద్ద ఉంచుకోవాలన్నారు. షాపుల ముందు ఎలాంటి వాహనాలు ఉంచ వద్దన్నారు. తరుచుగా ఆగిపోతున్న ట్రాఫిక్‌కు దుకాణదారులే కారణమన్నారు. పలుమార్లు ట్రాఫిక్ నిలిచిపోయిన సమయంలో గొడవలు జరుగుతున్నాయన్నారు. ఆటోలను సీరియల్ ప్రకారం బస్టాండ్ సెంటర్‌లో ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే తమకు తెలియజేయాలన్నారు.

ఇటీవల సైబర్ నేరగాళ్ల మాయలోపడి అమాయక ప్రజలు తమ అకౌంట్ల నుంచి డబ్బులు పోగొట్టుకుంటున్నారన్నారు. ఇటీవల మండలంలో ఇద్దరు ఉపాధ్యాయులు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఎస్.వెంకటేశ్వరరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


మారెళ్ళలో చిరువ్యాపారులు, గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ కమలాకర్

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

వీసీపల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలో శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. గుంటుపల్లి, నాయుడుగారిపల్లి, గుదేవారిపాలెం, మలినేనివారిపల్లి, పడమటిపల్లి గ్రామాల పరిధిలోని ఆలయాల్లో ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కలశాలతో వెళ్లిన భక్తులు ప్రదక్షిణలు చేసి ఆలయంలో ఉంచారు. గణపతి పూజ, అభిషేకాలు, సహస్రనామ అర్చనలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. రాత్రికి తిరునాళ్లను వైభవంగా నిర్వహించారు. గురువారం ఆలయం వద్ద మహిళలు పొంగళ్లు పెట్టి స్వామివారికి నైవేద్యం సమర్పించడంతో ఆరాధన ఉత్సవం ముగిసింది.


విద్యుత్ దీపాలంకరణలో బ్రహ్మంగారి ఆలయం


ప్రత్యేక అలంకరణలో వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబ మూలవిరాట్‌లు

భక్తిశ్రద్ధలతో వాసవీమాత జయంతి

పామూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): శ్రీవాసవి కన్యాకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, సహస్రనామ పూజలు నిర్వహించారు.

ముందుగా స్థానిక సత్యదేవుని దేవస్థానం నుంచి పలువురు ఆర్యవైశ్య మహిళా భక్తులు వాసవీ మాత ఆలయం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


కళశాలను తీసుకొస్తున్న భక్తులు


ప్రత్యేక అలకంరణలో వాసవీమాత


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

కనిగిరి, మే 8 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ అన్నారు. పట్టణంలో గంజాయి అమ్ముతున్న నలుగురు వ్యక్తులను పట్టుకున్నట్లు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని దొరువు వద్ద అక్రమంగా గంజాయి నిల్వ ఉంచిన స్థావరంపై ఆకస్మిక దాడి చేసి 1.5 కేజీలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. దొరువు ప్రాంతానికి చెందిన నాగులూరి రాజేష్, నాగులూరి దుర్గా ప్రసాద్‌తో పాటు మరో ఇద్దరు మహిళలు పట్టణానికి చెందిన నాగులూరి వెంకటేశ్వర్లు, నాగులూరి అంకబాబు వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన గంజాయిని చిన్న, చిన్న ప్యాకెట్‌లుగా చేసి అమ్ముతున్నట్లు తెలిపారు. గురువారం కార్డెన్ సెర్చ్‌లో భాగంగా దొరువు ప్రాంతంలో తనిఖీలు చేపట్టగా అక్రమంగా నిల్వ ఉంచిన గంజాయిని గుర్తించినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. అత్యంత చాకచక్యంగా వ్యవహరించి గంజాయిని పట్టుకున్న సీఐ ఖాజావలి, ఎస్‌ఐ టి.శ్రీరాం, మాధవరావు, వీసీపల్లి ఎస్‌ఐని డీఎస్పీ అభినందించారు. గంజాయి అమ్మకాలు చేస్తుంటే సంబంధిత వ్యక్తుల వివరాలను తెలియాజేయాలన్నారు. తెలిపినవారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. సమావేశంలో సీఐ, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ముండ్లమూరులో భారీ వర్షం

- పలు గ్రామాల్లో తడిసిపోయిన మిర్చి
- రహదారులు జలమయం


ముండ్లమూరులో పోలీసుస్టేషన్ వద్ద జలమయమైన రహదారి


పూరిమెట్లలో కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి తడవకుండా పట్టలు కప్పుతున్న రైతులు

ముండ్లమూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి తడిసిపోయింది. వైట్ బర్లీ పొగాకు కూడా తడిసి ముద్దయింది. మిరప, నూగు, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలో ఈదర, జమ్మలమడక, మక్కెనవారిపాలెం, పూరిమెట్ల, ఉమామహేశ్వర అగ్రహారం, నాయుడుపాలెం, తమ్మలూరు, మారెళ్ళ, నూజెండ్లపల్లి, సుంకరవారిపాలెం, తూర్పు కంభంపాడు గ్రామాల్లో గంటన్నరకు పైగా ఏడతెరిపిలేకుండా వర్షం కురిసింది. ముండ్లమూరు, పసుపుగల్లు, సింగనపాలెం, వేంపాడు, పోలవరం గ్రామాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. ఉదయం ఎండ తీవ్రతకు ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. సాయంత్రానికి ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో పాటు భారీ వర్షం కురిసింది. పూరిమెట్ల, ఉమామహేశ్వర అగ్రహారం, సుంకరవారిపాలెం గ్రామాల్లో మిరపకాయలు కోసి కల్లాల్లో ఎండ బెట్టారు. ఒక్కసారిగా గాలి, ఉరుములతో వర్షం పడటంతో పంటను కాపాడుకోవడానికి రైతులు మిరప కల్లాలపై పట్టలు కప్పారు. అయినా గాలి తీవ్రతకు కొన్నిచోట్ల కల్లాల్లో మిర్చి తడిసి పోయింది. దీంతో రైతులకు అపార నష్టం వాటిల్లింది. వైట్‌బర్లీ పొగాకు తడిసి పోయింది. మొక్కజొన్న పంటను కోసి పొలాల్లోనే ఉంచటంతో భారీవర్షానికి నష్టం వాటిల్లింది. పసుపుగల్లు, చింతలపూడి, వేములబండ, రమణారెడ్డి పాలెం, ఈదరలో నూగు నేలకొరిగింది. వర్షానికి ముండ్లమూరులోని పోలీసు స్టేషన్ ఎదురు రహదారి జల మయమైంది. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

ఉష్ణోగ్రత (అంచనా) 9-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	27
తెనాలి	39	27
నరసరావుపేట	39	25
బాపట్ల	37	28
రెంటచింతల	39	26
చీరాల	37	28

కలెక్టర్‌కు.. రెడ్‌క్రాస్ అవార్డు

v వెంకటమురళికి అందజేసిన గవర్నర్



గవర్నర్ నజీర్ నుంచి అవార్డు అందుకుంటున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా కలెక్టర్ జె.వెంకటమురళి చేపడుతున్న సేవలను గవర్నర్ అబ్దుల్‌నజీర్ ప్రశంసించారు. రాజ్‌భవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ నుంచి కలెక్టర్ అవార్డు అందుకున్నారు. సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే బాపట్లను అగ్రగామిగా నిలిపినందుకు కలెక్టర్‌కి అవార్డు, పతకాన్ని అందజేశారు. ఇటీవల కృష్ణానది వరద విపత్తు సమయంలో జిల్లాలో ఎలాంటి ప్రాణహాని జరగకుండా ముందస్తు ప్రణాళికతో జాగ్రత్త చర్యలు తీసుకున్నారని కలెక్టర్‌ను గవర్నర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాలపై నిఘా

v వదంతులను వ్యాపింప చేస్తే కఠినచర్యలు v ఎస్పీ తుషార్‌డూడీ హెచ్చరికలు

బాపట్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాలపై సైబర్‌సెల్ పోలీసులతో ప్రత్యేకంగా నిఘా ఉంచామని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. డీపీవో, సోషల్‌మీడియాసెల్‌ను గురువారం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెచ్చగొట్టే విధంగా వార్తలను సోషల్ మీడియా వేదికగా వ్యాపింప చేసేవారిని వేగవంతంగా గుర్తించాలని సోషల్ మీడియాసెల్ అధికారులకు ఎస్పీ సూచించారు. విద్వేషపూరితమైన సమాచారాన్ని సోషల్ మీడియలో పోస్ట్ చేసేవారిని గుర్తించి, వివరాలను సంబంధిత స్టేషన్ ఎస్‌హెచ్‌వోలకు అందజేయాలన్నారు. సిబ్బంది రికార్డులు సక్రమంగా నిర్వహించాలని డీపీవో అధికారులకు సూచించారు. సామాజిక మాధ్యమాలలో విద్వేషపూరిత వదంతులను వ్యాపింప చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ జయకుమార్, ఐటీ కోర్ ఎస్ఐ నాయబ్ రసూల్ పాల్గొన్నారు.



సోషల్ మీడియా, సైబర్‌సెల్ విభాగాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

- లక్ష్యం చేరుకోవడంలో అధికారుల విఫలం
- అసంఘటిత కార్మికులకు కార్డుల జారీ అంతంతే
- బహుళ ప్రయోజనాలున్నా అవగాహనపై ఉదాసీనం
- నమోదుకు దూరంగా ఇంకా ఏడు లక్షల మంది శ్రామికులు

ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షలు.. గాయపడితే లక్ష వరకు ఆర్థిక సాయం. అసంఘటిత రంగ కార్మికులకు పైసా ఖర్చు లేకుండా బీమా అందించేలా కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ్ కార్డును ప్రవేశపెట్టింది. కార్మికుల భద్రత, సంక్షేమమే ధ్యేయంగా ప్రాయోజిత పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ సంక్షేమ పథకాలకు అర్హులుగా తేల్చడానికి కూడా ఈ-శ్రమ్ ప్రామాణికంగా ఉపయోగపడనుంది. అసంఘటిత రంగ కార్మికులకు ఎన్నో ప్రయోజనాలను చేకూర్చే ఈ కార్యక్రమంపై అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కార్మికులకు అవగాహన కల్పించి ఈ-శ్రమ్‌లో నమోదు చేసుకునేలా వారిని చైతన్యపరచాల్సిన యంత్రాంగం ఉదాసీనంగా ఉంటున్నది. దీంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల వారీగా లక్ష్యాలకు ఆమడ దూరంలో కార్మికశాఖ ఉంది. మూడు జిల్లాల్లో ఇంకా 7 లక్షల మంది కార్మికులు ఈ-శ్రమ్‌కు దూరంగా ఉంటున్నారంటే అధికారుల్లో నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది.



ఈ-శ్రమ్... నిర్లక్ష్యం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రాయోజిత పథకం ఈ-శ్రమ్. ఇందులో నమోదు చేసుకున్న కార్మికుడికి ఈ-శ్రమ కార్డును ప్రభుత్వం అందించనుంది. కార్మికులకు ఎంతో ఉపయోగపడే ఈ పథకాన్ని గత ప్రభు త్వం పూర్తిగా అటకెక్కించగా.. ప్రస్తుత ప్రభు త్వంలోనూ అదే ధోరణి కనిపిస్తోంది. కేంద్రం నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. ప్రధానంగా ఈ పథకంపై క్షేత్రస్థాయిలో కార్మికులకు అవగాహన కల్పించే వారే కరువయ్యారు. అసంఘటిత కార్మికులకు ఎంతగానో ఉపయోగపడే ఈ-శ్రమ్ కార్డు విషయంలో నెలవారీగా సమీక్షలు జరిపి పురోగతి తెలుసుకోవడం కూడా లేదు. మొక్కుబడిగా ఓ ప్రకటన ఇచ్చి వదిలేయడం తప్పితే లక్ష్యాలను చేరుకుని పథకం ఫలాలను కార్మికులకు చేరుస్తామన్న చిత్తశుద్ధి యంత్రాంగంలో కొరవడింది. ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోని కార్మికుల సంఖ్య గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో దాదాపు ఏడు లక్షల మంది వరకు ఉన్నట్లు సమాచారం. ఒక్క బాపట్ల జిల్లాలోనే రెండున్నర లక్షలమంది ఈ పథకానికి దూరంగానే ఉన్నారు. ఈ-శ్రమ్ నమోదుకు సంబంధించి సచివాలయాల వారీగా కార్మికశాఖ సమీక్ష చేయ లేదు. నిర్దేశించిన లక్ష్యాలకు దూరంగా ఉన్నా నమోదులో గణనీయమైన ఫలితాలు సాధిస్తు న్నామనే ఆర్భాటపు ప్రకటనలకే కార్మికశాఖ పరిమితమైందని విమర్శలు వస్తున్నాయి. పైగా కార్మికుల డేటా ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఉన్నందున నమోదులో జాప్యం జరుగుతుం దనేది యంత్రాంగం వాదన. 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు కలిగిన అసంఘటిత రంగ కార్మికులందరూ ఈ పథకానికి అర్హులు. ఈఎస్ఐ, ఈపీఎఫ్ సభ్యత్వం లేని చిరువ్యా పారులు, భవన నిర్మాణ కార్మికులు, వీధి వ్యాపా రులు, ఆశా వర్కర్లు, మత్స్యకారులు, ఉపాధి హామీ శ్రామికులు, ఆటో డ్రైవర్లు, రిక్షా, రాడ్ బెండింగ్, ప్లంబింగ్, టైల్స్, కరెంటు, వెల్డింగ్, ఇటుక తదితర రంగాలలో పనిచేసే వారందరూ కూడా అర్హులే. కానీ వీరిలో చాలామందికి ఈ-శ్రమ్‌లాంటి ఓ పథకం ఉందని కూడా తెలియకపోవడం విశేషం. పోర్టల్‌లో వివరాలను నమోదు చేసుకునేందుకు గ్రామ, వార్డు సచివాలయాలు, సీఎస్సీ కేంద్రాలు, కార్మికశాఖ కార్యాలయంలో అవకాశం ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ-శ్రమ్ కార్డు నమోదుకు రూ.13 చొప్పున ఇస్తామని ప్రకటించి కామన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకులకు రూ.50 లక్షలు బకాయి పెట్టింది. దీంతో ఆయా సెంటర్ల నిర్వాహకులు ఈ-శ్రమ్ కార్డు నమోదును నిరుత్సాహ పరుస్తున్నట్లు సమాచారం.



ఫీజు.. పత్రాలని పీడింపు

ఈ-శ్రమ్‌పై అవగాహనతో కొందరు నమోదుకు ఉత్సాహంగా ముందుకు వస్తున్నా వారిని ఫీజు, ధ్రువీకరణపత్రాలంటూ పీడిస్తున్నట్లు సమాచారం. నమోదుకు ఎలాంటి ఫీజు అవసరం లేదు. అయితే కొన్ని చోట్ల రిజిష్టర్ పేరిట వసూళ్లకు దిగుతున్నట్లు తెలుస్తోంది. నమోదుకు ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్‌తో పాటు ఆధార్‌కు లింక్ అయి ఉన్న ఫోన్ నంబరు, నామినీ ఆధార్ వివరాలు చాలు. కానీ ఏవేవో పత్రాలు కావాలని తమను తిప్పుకుంటున్నారని కార్మికులు వాపోతున్నారు.

1 47.848 కిలోమీటర్ల పొడవునా ప్రతిపాదిత మార్గం 1 ఎన్‌హెచ్-216, ఎస్‌హెచ్-261, 269, 334, 279, 350 మీదగా నిర్మాణం 1 ఈ రూట్ అయితే బహుళ ప్రయోజనాలున్నాయని కన్సెల్టెన్సీ అభిప్రాయం 1 అమరావతి ఓఆర్‌ఆర్-నిజాంపట్నం పోర్టు హైవేకు కేంద్రం ఆమోదం

గ్రీన్‌ఫీల్డ్ హైవేకు.. నాలుగో ఎలైన్‌మెంట్

ఖర్చు తక్కువ.. పర్యాటకం

గుంటూరు, బాపట్ల జిల్లాల మీదగా నాలుగో ఎలైన్‌మెంట్‌కు అటు కన్సల్టెన్సీ ఇటు అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందులో ఎన్‌హెచ్-216, రాష్ట్ర హైవేలు-261, 269, 334, 279, 350 మీదగా రోడ్డు నిర్మాణాన్ని ప్రతిపాదించింది. 47.848 కిలోమీటర్లు పొడవునా నిర్మించే ఈ రోడ్డుకు ఖర్చు తగ్గుతుందని అంచనా వేశారు. ఈ హైవేతో ప్రముఖ పర్యాటక ప్రదేశాలైన సూర్యలంక, చీరాల బీచ్‌లు, క్షీర భావన్నారాయణ స్వామి, సుందరవల్లి, జిల్లెళ్లమూడి అమ్మవారు, సహస్రలింగేశ్వర, వీరాంజనేయస్వామి దేవస్థానాలకు పర్యాటకం పెరుగుతుందని డీపీఆర్ రూపొందించిన సంస్థ అభిప్రాయం వ్యక్తం చేసింది.

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): త్వరలో నిర్మించబోయే అమరావతి అవుటర్ రింగురోడ్డులో గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం నారాకోడూరు నుంచి బాపట్ల జిల్లా నిజాంపట్నం పోర్టు వరకు కేంద్ర ప్రభుత్వం నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవేకి సుముఖత వ్యక్తపరిచింది. ఇందుకోసం సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి డీపీఆర్ నివేదించేందుకు కన్సల్టెన్సీకి బాధ్యతలు అప్పగించింది. ఆ సంస్థ తొలుత మూడు ఎలైన్‌మెంట్లను పరిశీలించి నివేదిక అందజేసింది. కొత్తగా నాల్గో ఎలైన్‌మెంట్‌ని కూడా సిద్ధం చేసి ప్రజంటేషన్ ఇచ్చింది. సామాజిక ప్రభావం తక్కువగా, ఖర్చు తక్కువయ్యే ఈ నాలుగో ఎలైన్‌మెంట్ ప్రకారం నిర్మిస్తే పర్యాటకం పెరుగుతుందని కన్సల్టెన్సీ సంస్థ డీపీఆర్‌లో పొందుపరిచింది. 47.848 కిలోమీటర్లు పొడవునా నిర్మించే ఈ రోడ్డుకు ఖర్చు రూ.1391.46 కోట్లయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. ఇందులో భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్‌కు రూ.240.98 కోట్లు, నిర్మాణాలకు రూ.890.93 కోట్లు అవుతాయని డీపీఆర్‌లో పొందుపరిచారు. వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు అత్యుత్తమైన కనెక్టివిటి పెరుగుతుంది. సూర్యలంకలోని ఇండియన్ ఎయిర్‌ఫోర్సు బేస్‌స్టేషన్, నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్‌కు కనెక్టివిటీ పెరిగి స్థానికంగా ఆర్థికాభివృద్ధి జరుగుతుంది. అంతేకాకుండా రాష్ట్ర హైవేలు ఎస్‌హెచ్-240, 261పై ట్రాఫిక్ తగ్గి సరుకు రవాణా వేగవంతంగా జరుగుతుంది. 1975లో 27.87 ఎకరాల అటవీ మళ్లింపు జరగ్గా ఇందులో 17.87 ఎకరాలను ఫిషింగ్ హార్బర్ అప్రోచ్‌కు వినియోగిస్తున్నారు. మిగతా భూమిలో ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి ఏపీఎంబీ సీఈవో ఎన్‌వోసీ కూడా జారీ చేశారు. పర్యావరణ హితంగా నిర్మించబోయే ఈ రోడ్డు మార్గంలో మొత్తం 24 చోట్ల కెనాల్/రివర్ క్రాసింగ్స్ చేయాలి. అలానే విజయవాడ-గూడూరు సెక్షన్‌లో చుండూరు రైల్వేస్టేషన్‌కు సమీపంలో 12+245 వద్ద రైల్వే క్రాసింగ్ కూడా చేయాల్సి ఉంటుంది. రేపల్లె - బాపట్ల డీసీ/ఎస్‌సీ లైన్(పీ)లో 28+550 లొకేషన్ వద్ద 132 కేవీ పవర్ లైన్‌ని కూడా క్రాస్ చేయాల్సి ఉన్నది. ఈ డీపీఆర్‌కి కేంద్రం కనక ఆమోదం తెలిపితే ఆరు నెలల్లో భూసేకరణ, ఏడాది వ్యవధిలో నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉంటుందని బాపట్ల ఎంపీ కృష్ణప్రసాదు స్పష్టం చేశారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టును త్వరితగతిన గ్రౌండింగ్ చేసేందుకు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, బాపట్ల ఎంపీ టీ కృష్ణప్రసాదు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.



మ్యాప్‌లో నీలం రంగులో ఉన్న ప్రాధాన్య ప్రతిపాదిత ఎలైన్‌మెంట్

రాబోయే ప్రాజెక్టులు

ఈ ఎలైన్‌మెంట్ వెంట కొత్తగా పలు ప్రాజెక్టులు రాబోతున్నాయి. నల్లపాడు - కృష్ణాకెనాల్ రైల్ ఓవర్ రైల్, కృష్ణాకెనాల్ - నల్లపాడు 3, 4 రైలు మార్గాలు, ఈస్టు కోస్టు కారిడార్ భవిష్యత్ డీఎఫ్‌సీ, కృష్ణానది వంతెన మీదగా గుడివాడ - తెనాలి(విజయవాడను బైపాసు చేస్తూ) రోడ్డు మార్గం వంటి ప్రాజెక్టులు ఇప్పటికే మంజూరై ఉన్నాయి.

వాడరేవులో వైసీపీకి షాక్

1 టీడీపీలో చేరిన 300 కుటుంబాలు

చీరాల, మే 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వైసీపీకు మరో షాక్ తగిలింది. వాడరేవు గ్రామంలో వైసీపీకి చెందిన క్రియాశీలక నాయకులు ధోనె రామిరెడ్డి, కావూరి నాగరాజు, మంచాల నాగరాజు, పెద్దబ్బాయి తదితరుల సారథ్యంలో 300 కుటుంబాలతో కలిసి గురువారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కొండయ్య, నియోజకవర్గ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్ పార్టీ కండువాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో యువ నాయ కుడు గౌరీఅమర్నాథ్, ఏఎంసీ చైర్మన్ జనార్థనరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు బందు గురన్న, మాజీ ఎంపీటీసీ పిన్నిబోయిన రామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.



పార్టీ కండువాతో స్వాగతిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, పక్కన నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్



1 ముళ్లచెట్లపైనే విదేశీ పక్షులు
1 మైలవరం, వెలమవారిపాలేల్లో విహంగాల సందడి
1 సరైన సౌకర్యాలు కల్పించాలంటున్న పక్షి ప్రేమికులు

ఆవాసం లేక అవస్థలు

అద్దంకి, మే 8 (ఆంధ్రజ్యోతి): విదేశీ పక్షుల రాకతో.. మండలంలోని మైలవరం, బల్లికురవ మండలం వెలమవారిపాలెంలో సందడి నెలకొం టోంది. ఏటా జనవరి నెలలో నైజీరియా దేశం నుంచి కొంగలు వచ్చి జూన్ నెల వరకు ఉండి గుడ్లు పెట్టి పిల్లలను పెంచుకుని వెళ్తుంటాయి. గుండ్ల కమ్మ నది, చెరువులు, పుష్కలంగా నీటి వనరులతో నైజీరియా కొంగలు పెద్దసంఖ్యలో వస్తుంటాయి. అయితే ఈ ప్రాంతాల్లో ఆ పక్షులకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాయి. ఆహారానికి కొదువ లేకపోయినా ఆశ్రయానికి సరైన వసతి లేదు. వందల సంఖ్యలో పక్షులు వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఇక్కడకు వస్తున్నా.. వాటి ఆవాసానికి అధికారులు చర్యలు తీసుకోవడంలేదు. గతంలో వెలమవారిపాలెంలో పెద్ద చింత తోపు ఉండటంతో వాటి ఆశ్రయానికి ఇబ్బంది ఉండేది కాదు. అక్కడ గూళ్లు పెట్టుకుని సమీపంలో వేటసాగిస్తూ జీవనం సాగించేవి. అయితే చింతచెట్లు క్రమేపి కనుమరుగు కావడంతో సరిపడా చెట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాయి. ప్రస్తుతం అరకొరగా ఉన్న ముళ్ల చెట్లు, తుమ్మ చెట్లపైనే గూళ్లు పెట్టుకుని ఉంటున్నాయి. ప్రభుత్వం స్పందించి వెలమవారిపాలెం, మైలవరం గ్రామాల వద్ద చెట్ల పెంపకం చేపడితే విదేశీ పక్షులు రాక మరింత పెరిగే అవకాశం ఉందని పక్షి ప్రేమికులు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మైలవరం చెరువుకు పూర్తిస్థాయిలో నీరు నింపాలని కోరుతున్నారు. అదే సమయంలో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మోదీ నిర్ణయం చారిత్రాత్మకం

ఉగ్రవాదులకు బుద్ధి చెప్పేలా సిందూర్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి

కారంచేడు(పర్చూరు), మే 8 (ఆంధ్రజ్యోతి): పాక్ ఉగ్రవాదుల దుశ్చర్యలకు బుద్ధి చెప్పేలా ప్రధాని నరేంద్రమోదీ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. గురువారం స్వగ్రామం కారంచేడులో జరిగిన శ్రీకోదండరామస్వామి దేవాలయ శంకుస్థాపన కార్యక్రమంలో దగ్గుబాటి పురందేశ్వరి, వెంకటేశ్వరరావు దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ రక్షణ కోసం మోదీ ప్రభుత్వం ఎంత దూరమైన వెళ్తుందన్నారు. ఉగ్రవాదులపై దాడి విషయంలో ప్రపంచ దేశాలన్నీ భారత్‌కు మద్దతుగా నిలిచాయన్నారు. ఉగ్ర దాడిలో సిందూరాన్ని పోగొట్టుకున్న 26 మంది మహిళల ఆకాంక్షలకు అనుగుణంగా ఆపరేషన్ సిందూర్ అని తెలిపారు. హఫీజ్ సయ్యద్ సంస్థలో ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తారని ముంబై తాజ్ హోటల్ దాడిలో పట్టుబడిన కసబ్ చెప్పిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు.



అవీ..ఇవీ..

ఎస్సై ఖాదర్‌బాషాకు వీఆర్

అద్దంకి,మే8(ఆంధ్రజ్యోతి): అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఖాదర్‌బాషాను గురువారం జిల్లా అధికారులు వీఆర్‌కు పిలిచినట్లు తెలుస్తుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌హెచ్‌వోగా ఉన్న అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై గా విధులు నిర్వహిస్తున్న ఖాదర్‌బాషాపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో వీఆర్ కు పిలిచినట్లు సమాచారం.

రాయితీపై పశువుల దాణా

అద్దంకిటౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): పశుగ్రాస భద్రత విధానంలో భాగంగా దారిద్య రేఖకు దిగువన ఉన్న రైతులకు 20 శాతం క్రూడ్ ప్రోటీన్ కలిగిన పశుదాణాను రాయితీపై అందజేస్తున్నట్లు అద్దంకి పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.మోహనరావు గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. 50 కిలోల దాణా సంచి పూర్తి ధర రూ.1110 కాగా ప్రభుత్వం రాయితీ కింద రూ.555లకు ఇస్తుందని అన్నారు. రైతు ఆధార్‌కార్డు, తెల్లరేషన్ కార్డుతో పాటు మీ గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పశువులకు చెవికి కమ్మ కచ్చింగా ఉండాలని, టీకాలు వేసి ఉండి రైతు పేరు భారత్ పశుధన్‌లో నమోదు చేయించుకుని దాణాని పొందాలన్నారు. ఒక్కో కుటుంబానికి 450 కిలోలు మాత్రమే వస్తుందన్నారు. 2 గేదెలు, 1 దూడకు వీటిని అందిస్తారన్నారు.పశువులు ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని తెలిపారు.

వరిగడ్డి వామి దగ్ధం

● 50 వేల రూపాయల ఆస్థి నష్టం

సంతమాగులూరు(అద్దంకి), మే8(ఆంధ్రజ్యోతి): సంతమాగులూరు మండలం కుందుర్తిలో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన మిరియాల కొండలుకు చెందిన ఏడెకరాల్లోని వరిగడ్డి వామి దగ్ధమైంది. వరిగడ్డి వామి దగ్ధం కావడంతో సుమారు రూ.50 వేల ఆస్థి నష్టం వాటిల్లినట్లు అద్దంకి అగ్నిమాపక కేంద్రం అధికారి వెంకట్రావు తెలిపారు. అద్దంకి అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు.

మహాకుంభాభిషేకానికి ఆహ్వానం



మంత్రిని ఆహ్వానిస్తున్న ఈవో

అద్దంకి, మే8 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి రాతి మండపం నిర్మాణం పూర్తయి 19న మహాకుంభాభిషేకం జరగనున్న నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పార్థసారధి, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు లను ఆహ్వానించారు. ఈఓ తిమ్మానాయుడు, వేదపండితులు హరిశంకరావధాని, పూజారులు కలిసి ఆహ్వానించారు.

రాతి మండపం నిర్మాణాకి విరాళం

అద్దంకి : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి రాతి మండపం నిర్మాణానికి అద్దంకి మండలం నాగులపాడుకు చెందిన జాగర్లమూడి వేణుబాబు, సౌజన్య దంపతులు గురువారం 1,00,116ను రూపాయలను ఈఓ తిమ్మానాయుడు కు అందజేశారు.

మండల సమాఖ్య కార్యాలయానికి పేరు మార్పు



బల్లికురవ మండల సమాఖ్య కార్యాలయానికి మార్చిన పేరు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బల్లికురవ. మే 8 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు బల్లికురవ మండల పొదుపు సంఘాల మహిళ సమాఖ్య కార్యాలయానికి వెలుగు కార్యాలయంగా పేరు ను అధికారులు మార్పించారు. మంగళవారం వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంగానే కొనసాగుతున్న వెలుగు కార్యాలం అని ఆంధ్రజ్యోతిలో ప్రచురితం అయిన వార్త కధనానికి జిల్లా అధికారులు స్పందించారు. వెంటనే బల్లికురవ వెలుగు కార్యాలయంపై ఉన్న వైఎస్ఆర్ క్రాంతి పథం అనే పేరును తొలగించాలని జిల్లా నుండి వచ్చిన ఆదేశాల మేరకు ఏపీఎం రాజారావు మహిళ సమాఖ్య కార్యాలయంపై వెలుగు కార్యాలయం అని పేరును ఏర్పాటు చేశారు. స్థానిక మండల అధికారులు జిల్లా అధికారులకు గతంలో ఉన్న పేరుపై వివరణ ఇచ్చారు.

ముదిరిన సొన పోరంబోకు స్థల వివాదం

పంచాయతీ కార్యదర్శిపై కేసు నమోదు


వివాదస్పద స్థలంలో కార్యదర్శి తోలిన రాళ్లు

రామన్నపేట(చీరాల), మే 8 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీ కార్యదర్శి సురేంద్రపై వేటపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పంచాయతీ పరిధిలోని బాపయ్యనగర్‌లో సొనపోరంబోకు స్థలం సుమారు 65 సెంట్లు ఉంది. ఇప్పటికే ఆ స్థలాన్ని స్థానికులు కొంత మంది అనుభవంలో ఉన్నారు. ఈక్రమంలోనే అదే ప్రాంతంలో నివాసముంటున్న చొప్పవరపు సంతోష్, ఆయన కుటుంబ సభ్యులు వారి పట్టా స్థలానికి ఆనుకుని ఉన్న కొంత సొన భూమిలో ఏళ్ల తరబడి పశువుల కొష్టం నిర్మించుకున్నాడు. అయితే దానిపై కన్నేసిన ఆ పంచాయతీ కార్యదర్శి సురేంద్ర అందులో తాను శాశ్వత నిర్మాణం చేసుకునేందుకు పూనుకున్నాడు. దీనికోసం ఏకంగా రాళ్లు కూడా తోలాడు. తనకు ఎలాంటి పట్టా లేకపోయినా, స్వయంగా తానే కార్యదర్శిగా ఉంటూ ప్రభుత్వ భూములను ఆక్రమించాలని చూడడం గమనార్హం. ఈక్రమంలోనే ఇప్పటికే అనుభవంలో సంతోష్‌కు, సురేంద్రకు మధ్య పలుమార్లు వాదనలు జరిగాయి. అయినప్పటికీ, కార్యదర్శి సురేంద్ర ఆ స్థలంలో సిమెంట్ రాళ్లు తోలడంతో సంతోష్, కార్యదర్శిల మధ్య జరిగిన ఘర్షణ తారాస్థాయికి చేరింది. ఏకంగా సెంట్రింగ్ చెక్కతో సంతోష్ ముఖంపై కార్యదర్శి సురేంద్ర దాడి చేశాడు. దీంతో సంతోష్ తలకు రక్తగాయాలయ్యాయి. క్షతగాత్రుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందాడు. అలాగే పంచాయతీ కార్యదర్శి కూడా స్వల్పగాయాలతో వైద్యశాలలో చేరాడు. పరస్పర ఫిర్యాదుల మేరకు వేటపాలెం పోలీసులు కేసులు నమోదు చేశారు.

పంచాయతీ కార్యదర్శిపై విమర్శలు వెల్లువ

ప్రభుత్వ ఆస్తిని రక్షించాల్సిన కార్యదర్శి, స్థలాన్ని తాను ఆక్రమించాలని చూడడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే తాను ఆక్రమించాలని చూడలేదని, ఉన్నతాధికారుల ఆదేశాలతోనే స్థలం వద్దకు వెళ్లగా సంతోష్ దాడిచేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒకవేళ సంతోష్‌దే తప్పిదమయితే విషయం అధికారుల దృష్టిలో ఉంచి చర్యలకు పూనుకోవాలే గానీ, విచక్షణ రహితంగా దాడి చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. మరోవైపు మండల స్థాయి అధికారులు విషయంపై పూర్తి స్థాయిలో నివేదికను సిద్ధం చేస్తున్నారు. శుక్ర, శనివారాల్లో జిల్లాస్థాయి అధికారులకు ఘటనపై పూర్తి వివరాలను అందజేయనున్నట్లు తెలుస్తోంది.

అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణ పనులు ప్రారంభం


ప్రారంభమైన భవన నిర్మాణ పనులు

అద్దంకి,మే8(ఆంధ్రజ్యోతి): అద్దంకిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేసిన పుష్కరకాలం తరువాత ఎట్టకేలకు సొంత గూడు ఏర్పడుతోంది. అద్దంకి పట్టణానికి 2013లో అగ్నిమాపక కేంద్రం మంజూరయ్యింది. అప్పట్లో తాత్కాలికంగా మార్కెట్ యార్డులో ఉంచారు. అయితే అగ్నిమాపక యంత్రం ఏర్పాటుకు కనీసం షెడ్డు కూడా లేకపోవడంతో గొట్టిపాటి రవికుమార్ లక్ష రూపాయలు సొంత నిధులు వెచ్చించి మార్కెట్ యార్డులోని గోడౌన్‌ల మధ్య ఖాళీలో రేకులషెడ్డు ఏర్పాటు చేయించారు. సిబ్బంది మార్కెట్‌యార్డు కార్యాలయంలో ఓ చిన్న గదిలో విధులు నిర్వహిస్తున్నారు. ఎట్టకేలకు గొట్టిపాటి రవికుమార్ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత అగ్నిమాపక కేంద్రానికి సొంత భవనం నిర్మాణానికి శింగరకొండ రోడ్డులో స్థలం కేటాయించారు. దీంతో సుమారు రూ.2.25 కోట్లతో అగ్నిమాపక కేంద్రం భవనం నిర్మాణానికి ఇటీవల మంత్రి గొట్టిపాటి రవికుమార్ శంకుస్థాపన చేశారు. గురువారం నుండి అగ్నిమాపక కేంద్రం భవనం నిర్మాణ పనులు ప్రారంభించారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై బీజేపీ హర్షం

బాణసంచా, స్వీట్లు పంపిణీతో కోలాహలం



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

చీరాల, మే 8 (ఆంధ్రజ్యోతి) : పాక్ ఉగ్రమూకలపై భారత సైనికులు చేసిన సిందూర్ ఆపరేషన్ విజయవంతంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలో బిజెపీ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమాయక పర్యాటకులపై పాక్ చేసిన దాడులను యావత్‌ప్రపంచం ఖండించిందన్నారు. ఈనేపద్యంలోనే ప్రధానీ మోదీ సరైన సమయంలో పాక్ ఉగ్ర వాదులకు గుణపాఠం చెప్పారని ఉద్ఘాటించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండారుపల్లి హేమంత్‌కుమార్, భవానీ, నాగేశ్వరరావు, వెంకటేష్, భరణి, సుజాత, కుమార్, చంద్ర, అశోక్ పాల్గొన్నారు.

వేగంగా వస్తున్న కారుకు టైర్ పంక్చర్

● ముందు వెళుతున్న బైకును డీకొట్టిన కారు ● ఇద్దరికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గంగయ్య

బల్లికురవ. మే 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అద్దంకి నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి కొప్పెరపాడు సమీపంలో వేగంగా వస్తున్న కారు టైర్ పంక్చర్ కావటంతో ముందు వెళుతున్న బైకును కారు డీకొట్టింది. ఈప్రమాదంలో బైకుపై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. అందిన సమాచారం మేరకు అద్దంకి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన అయప్ప, గంగయ్య అను ఇద్దరు బల్లికురవ మండలం సూరేపల్లి వెళ్లి తిరిగి బుధవారం మధ్యాహ్నం స్వగ్రామానికి బైకుపై వెళుతుండగా కొప్పెరపాడు గ్రామ సమీపంలో సంతమాగులూరు వైపు నుండి అద్దంకి వైపు వెళుతున్న కారు టైర్ పంక్చర్ కావటంతోకారు అదుపు తప్పి ముందు వెళుతున్న బైకును డీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలు అయిన అయప్ప, గంగయ్యలను హైవే అంబులెన్స్ లోచికిత్స కొరకు నర్సారావుపేట వైద్య శాలకు తరలించారు.

నూతన భవనంలోకి వైదన సచివాలయం

బల్లికురవ, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వైదన గ్రామంలో నూతనంగా నిర్మాణం పూర్తి అయిన భవనంలోకి గ్రామ సచివాలయాన్ని గురువారం మార్పు చేశారు. గతంలో ఉన్న భవనం పురాతన కాలం నాటిది కావటంతో నూతనంగా ప్రభుత్వ నిధులతో అన్ని వసతులతో నూతన భవనాన్ని నిర్మాణం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ప్రసాదరావు, గ్రామ టీడీపీ నేతలు పోగుల శేఖర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనంతరం సచివాలయ ఉద్యోగులు తమ సామాగ్రిని నూతన భవనంలోకి తరలించారు. ఇక నుండి నూనత భవనంలో ప్రజలకు సేవలు అందుతాయని అధికారులు తెలిపారు.

అంగన్‌వాడీలపై యాప్ పని భారాన్ని తగ్గించాలి


వినతిపత్రం అందజేస్తున్న అనంతలక్ష్మి

అద్దంకిటౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు తీసుకువచ్చిన యాప్‌లో పనిభారాన్ని తగ్గించాలని తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనంతలక్ష్మి కోరారు. గురువారం సచివాలయంలో రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని యూనియన్ సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాలకు మే నెల మొత్తం సెలవులు ఇవ్వాలని, ఆయాలకు, టీచర్లకు కనీస వేతనం ఇవ్వాలని, ప్రభుత్వం సంక్షేమ పథకాలు అన్ని అమలయ్యేలా జీవో సవరణ చేయాలని కోరారు. వేతనంతో కూడిన మెడికల్ సెలవులు, పెరిగిన ధరలకు అనుగుణంగా కూరగాయాలు, గ్యాస్ బిల్లులు పెంచాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. లక్ష్మీ నరసమ్మ, సభ్యులు కల్యాణి వినిలా తదితరులు ఉన్నారు.

రీ సర్వే వేగవంతం చేయాలి

చీరాల ఆర్‌డీవో చంద్రశేఖరనాయుడు


రీసర్వేపై సమీక్ష చేస్తున్న చీరాల ఆర్‌డీవో

అద్దంకి, మే8 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే వేగవంతం చేయాలని చీరాల ఆర్‌డీవో చంద్రశేఖర నాయుడు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అద్దంకి, కొరిశపాడు మండలాల వీఆర్‌వోలు, విలేజ్ సర్వేయర్లతో, ఆయన సమీక్ష నిర్వహించారు. వేసవి ఎండల దృష్ట్యా రీసర్వే ఉదయం, సాయంత్రం సమయాలలో పూర్తి చేయాలన్నారు. రైతులకు ముందస్తుగానే నోటీసులు ఇచ్చి రీసర్వే సమయంలో హజరయ్యే విధంగా చూడాలన్నారు. నీటి తీరువా బకాయిలు వసూలుపై దృష్టి సారించాలన్నారు. తహసీల్దార్లు శ్రీచరణ్, సుబ్బారెడ్డి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత వ్యవధిలో రీసర్వే పూర్తిచేయాలి

పంగులూరు : రెవెన్యూ రికార్డుల పరిశీలన, రైతుల అనుభవం ప్రాతిపదికన నిర్ణీత వ్యవధిలో నిష్పక్షపాతంగా భూముల రీసర్వే ప్రక్రియ పూర్తి చేయాలని ఆర్‌డీవో చంద్రశేఖరనాయుడు ఆదేశించారు. పంగులూరు మండలంలోని బైట మంజులూరు, కొండమూరు గ్రామాలలో జరుగుతున్న భూముల రీసర్వేపై స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. రీసర్వే ప్రాధాన్యతను రైతాంగానికి వివరించాలన్నారు. కార్యక్రమం లో తహసీల్దార్ పీవీ.సింగారావు, రీసర్వే డీటీ అర్జున్, మండల సర్వేయర్ బి.సురేష్‌బాబు, వీఆర్‌వోలు గ్రామ సర్వేయర్లు, పాల్గొన్నారు.

'నమస్తే' కార్యక్రమంపై అవగాహన

● వ్యర్థాలు సేకరించేవారితో 14న ప్రత్యేక సమావేశం

అద్దంకి, మే8(ఆంధ్రజ్యోతి): చెత్తకాగితాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించే వారిని సామాజిక భద్రత పథకాలలో భాగస్వామ్యం చేసేందుకు ఈ నెల 14న అద్దంకిలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు. నేషనల్ యాక్షన్ ఫర్ మేకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం(నమస్తే) ద్వారా పారిశుద్య కార్మికులు, పొడి వ్యర్దాలను సేకరించే వారికి గుర్తింపు కార్డులు, సామాజిక భద్రత, ఆర్థిక అభివృద్ధి, ఆరోగ్య ప్రయోజనాలు, నైపుణ్యం మెరుగుదలకు తోడ్పాటు, శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. తద్వారా సాధికారిత కల్పించడమే 'నమస్తే' కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. నిర్వహణపై గురువారం బాపట్ల జిల్లా రిసోర్స్ ఆర్గనైజర్లు దార్ల కోటేశ్వరరావు, భగవాన్‌దాస్‌లు మున్సిపల్ కమిషనర్‌తో చర్చించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కట్నం వేధింపుల కేసు నమోదు

అద్దంకి, మే8(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వేధింపులపై గురువారం అద్దంకి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. పోలీసుల కధనం మేరకు మండలంలోని ధేనువకొండకు చెందిన గుంజి సుశీలకు 15 సంవత్సరాల క్రితం మేనత్త కుమారుడు శ్రీనివాస్‌తో వివాహమైంది. వివాహం సమయంలో రూ.10 వేల రూపాయల నగదుతో పాటు 4 సవర్ల బంగారం ఇచ్చారు. ప్రస్తుతం వారు హైదరాబాద్‌లో బేల్దారి పనులు చేసుకుంటున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీనివాస్ కొంతకాలంగా మద్యానికి బానిసై అదనపు కట్నం కోసం వేధించటం ప్రారంభించాడు. అత్త,మామలను కూడా ఇబ్బంది పెడుతూ రెండు నెలల క్రితం సుశీలను పుట్టింటికి పంపారు. సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

సారవంతమైన భూమితో సాగుకు మేలు

తోటవారిపాలెం(చీరాల), మే 8 (ఆంధ్రజ్యోతి) : భూమిలో ఉన్న సారాన్ని నిశితంగా అంచనా వేసి సాగు చేయడం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ డివిజన్ అధికారి భారతి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం మండల పరిధిలోని తోటవారిపాలెం. గవినివారిపాలెంలలో ఏపీ సీఎన్‌ఎఫ్(ఏపి భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం), పీఎండీఎస్(ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భారతి, టీడీపీ నాయకులు నాదెండ్ల కోటేశ్వరరావు, రైతుసంఘం నాయకులు కావూరి రమణారెడ్డి, కోటేశ్వరమ్మ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కవిత, స్వరూప నిర్మలరైతులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ విద్యార్థి మృతిపై కేసు నమోదు

అద్దంకి,మే8(ఆంధ్రజ్యోతి): నాగార్జున యూనివర్శిటీ లో బిపిఎడ్ చదువుతున్న తిప్పాబత్తిన గురు బ్రహ్మయ్య(27) గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పై గురువారం అద్దంకి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవితేజ తెలిపారు. పోలీసుల కధనం మేరకు మండలంలోని కొటికలపూడికి చెందిన గురుబ్రహ్మయ్య నాగార్జున యూనివర్శిటీ లో బీపీఎడ్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. ఫిబ్రవరి 26న ఇంటికి వచ్చిన గురుబ్రహ్మయ్య బయటకు వెళ్లి మధ్యాహ్నం 1 గంట సమయంలో ఇంటికి వచ్చి మౌనంగా ఉన్నాడు. కుటుంబసభ్యులు ఆరా తీయగా గడ్డి మందు తాగినట్లు చెప్పడంతో ఒంగోలులోని ప్రవేట్ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మార్చి 5న మృతి చెందాడు. అక్కడి నుండి వచ్చిన సమాచారం మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవితేజ తెలిపారు.

విద్యుత్‌శాఖ డీఈగా శ్రీనివాసరావు బాధ్యతలు

వేటపాలెం (చీరాల), మే 8 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం విద్యుత్ డీఈగా పెరుగు శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. చెరుకుపల్లి ఏఈగా ఉన్న ఆయన ఉద్యోగోన్నతిపై వేటపాలెంకు విచ్చేశారు. అలాగే ఇప్పటి వరకు ఇక్కడ విధుల్లో ఉన్న శ్రీనివాసులు పర్చూరుకు బదిలీ అయ్యారు. ఈక్రమంలో కార్యాలయం సిబ్బంది డీఈకి స్వాగతం పలికారు.

ట్రాలీవాహనం ఢీకొని ఆటోడ్రైవర్‌కు గాయాలు

ఈపూరుపాలెం (చీరాల), మే 8 (ఆంధ్రజ్యోతి) : ఆటోను అతివేగంతో గుర్తుతెలియని ట్రాలీవాహనం ఢీ కొనడంతో ఆటో పూర్తిగా ధ్వంసమైంది. అలాగే డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం ఉదయం ఈపూరుపాలెం చెక్‌పోస్టు సమీపంలో చోటుచేసుకుంది. దీంతో స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. చీరాల వైపు నుండి వెదుళ్లపల్లి వైపు వెళుతున్న బొలేరో అదుపు తప్పి రాంగ్‌రూట్‌లో ఆటోను ఢీకొట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఈపూరుపాలెం(చీరాల), మే 8 (ఆంధ్రజ్యోతి) : ఈపూరుపాలెం స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. ఈక్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సై చంద్రశేఖర్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దీంతో ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

నేడు మంత్రి పర్యటన

అద్దంకి,మే8(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం ఉదయం 10-30 గంటలకు పంగులూరు మండలం తూర్పుకొప్పెరపాడు, 11-30 గంటలకు అద్దంకి మండలం గోవాడ, మధ్యాహ్నం 12 గంటలకు సంతమాగులూరు మండలం కామేపల్లిలలో పర్యటించనున్నారు.

కోదండరామ స్వామి ఆలయానికి శంకుస్థాపన


పూజలు చేస్తున్న వెంకటేశ్వరరావు దంపతులు


కారంచేడు(పర్చూరు), మే 8 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు గ్రామంలోని కోదండరామ స్వా మి ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరావు దంపతులు పాల్గొని స్వామివారి భక్తిని చాటుకున్నారు. ఆలయ అర్చకుల సారధ్యంలో స్వామివార్ల ఆలయ శంకుస్థాపన నిర్వహించారు. ఆనంతరం గ్రామస్థులతో కొంతసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న అర్చకులు

పంగులూరు, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకూరు కొండపై కొలువుదీరిన రామలింగేశ్వర స్వామి తృతీయ వార్షిక మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఐదు గంటలకు ఆలయ గిరి ప్రదక్షణ, అనంతరం మహాగణపతి పూజ, మహన్యాసం, శ్రీ రామలింగేశ్వరస్వామి వారి ఏకాదశ రుద్రాభిషేకం, బాలాత్రిపురసుందరీదేవి కుంకుమార్చన, సుబ్రహ్మణ్య స్వామి పూజ, శ్రీ కాశీ అన్నపూర్ణాదేవి కుంకుమార్చన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకునని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

13న అద్దంకిలో ధ్వజస్తంభం ఊరేగింపు


ఊరేగింపుకు సిద్ధంగా ఉన్న ధ్వజస్తంభం

అద్దంకి,మే8(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 19న మహాకుంభాభి షేకము తో పాటు జీవ ధ్వజస్థంభము పునః ప్రతిష్ట జరగనుంది. గతంలో ధ్వజస్తంభం ను సుమారు నాలుగు దశాబ్దాల క్రితం మేదరమెట్ల శంకరారెడ్డి సమకూర్చారు. ఈ నేపధ్యంలో ప్రస్తుతం కూడా మేదరమెట్ల శంకరారెడ్డి కుమారులు రాజశేఖరరెడ్డి, చం ద్రశేఖరరెడ్డి లు సమకూర్చుతున్నారు. జీవధ్వజస్థంభం ను అద్దంకి లో సిద్దం చేస్తున్నారు. 14 వ తేది నుండి శింగరకొండ లో ప్రత్యేక పూజలు జరగనున్న నేపధ్యం లో 13 వ తేది జీవ ధ్వజస్థంభం ను అద్దంకి లో ఊరేగింపు నిర్వహించనున్నారు. సాయం త్రం 4 గంటలకు నంబూరివారిపాలెం వద్ద సొసైటీ కార్యాలయం నుండి ఊరేగింపు ప్రారంభమై రేణింగవరం రోడ్డు, కాకానిపాలెం మండపం, పోతురాజుగండి, ఆర్టీసీ బస్టాండ్, పాత బస్టాండ్ సెంటర్, గాంధీబొమ్మసెంటర్, భవానిసెంటర్ మీదుగా శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వరకు సాగుతుందని ఈఓ తిమ్మానాయుడు తెలిపారు.

పోలేరమ్మ దేవస్థానంలో ఎమ్మెల్యే పూజలు

పాతచీరాల(చీరాల), మే 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పాత చీరాల గ్రామంలో వేంచేసిన పోలేరమ్మ తల్లి దేవస్థానంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మేదరమెట్ల, మే 8(ఆంధ్రజ్యోతి): మహిళలకు జీవనోపాధిగా ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణను అందరు సద్వినియోగపర్చుకోవాలని బీసీ కార్పోరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మేదరమెట్లలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. శిక్షణ కేంద్రం నిర్వహణ, సౌకర్యాలను శిక్షణ పొందుతున్న మహిళలను అడిగి తెలుసుకున్నారు. శిక్షణ సద్వినియోగపర్చుకుని ఉపాధి మార్గాలను పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్, శిక్షణ కేంద్రం నిర్వాహకులు ఉన్నారు.

ఈదురు గాలులతో చల్లబడిన వాతావరణం


బల్లికురవలో కురుస్తున్న వర్షం

బల్లికురవ, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గురువారం ఈదురు గాలులు భారీ వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వేసవి ఎండలతో ప్రజలు ఉక్కిరి బిక్కిరికి గురైన వారు ఇళ్ల నుండి బయటకు రాలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం సాయంత్రం వాతావరణంలో మార్పులు వచ్చి ఆకాశంలో ఉరుములు, మెరుపులు, గాలులతో భారీ వర్షం కురవటంతో రోడ్లు అన్ని జలమయం అయ్యాయి. వర్షాకాలంలో మాదిరి వర్షం పడిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.. ఈదురు గాలుల ప్రభావానికి పెద్ద పెద్ద చెట్లు కూడా నేల వాలేలా ఊగి పోయాయని ప్రజలు తెలిపారు. అన్ని గ్రామాలలో వర్షం పడిందని ప్రజలు అంటున్నారు. గాలుల ప్రభావంతో రెండు గంటల పాటు విద్యుత్‌కు అంతరాయం కలిగింది.

అద్దంకి లో ఉరుములతో వర్షం

అద్దంకి : అద్దంకిలో గురువారం రా త్రి ఉరుములతో వర్షం కురిసింది. గాలులు ఎక్కువగా ఉండటంతో విద్యుత్ సరఫరాకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. సుమారు అరగంట పాటు వర్షం కురిసింది. మండలం పరిధిలోని చినకొత్తపల్లి, గోవాడ తదితర గ్రామాలలో ఓ మోస్తరు వర్షం కురిసింది. మొక్కజొన్న పంట, మిర్చి కల్లాలలో ఉన్న రైతులు పంటను కాపాడుకొనేందుకు పరుగులు తీశారు.

పిడుగుపాటు బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

చీరాల, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అకాలంగా వర్షం కురిసిన సమయంలో పిడుగుపడి నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం సాయం అందించింది. చీరాల మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన రైతు పిట్టు పోతురాజుకు చెందిన రెండు ఎడ్లు మృత్యువాత పడగా రూ.80 వేలు, అలాగే పాత చీరాలకు చెందిన నాయుడు మనోహర్‌రెడ్డి గేదె మృతి చెందగా రూ.50 వేలు, హరి ప్రసాద్‌నగర్‌కు చెందిన శ్రీనివాసరెడ్డికు చెందిన గేదెపై పిడుగు పడి మృతి చెందగా రూ.50 వేలు, కొత్తపేటకుచెందిన కటకం మహేశ్వరరావుకు చెందిన గేదె మృతి చెందగా రూ.50 వేలు పరిహారం చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఆయన వెంట ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపిడివో శివసుబ్రహ్మణ్యం ఉన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
శుక్రవారం 9 మే 2025



మన్ను మింగుతున్నా.. మిన్నకుండిపోతున్నారేం?

తవ్వేసి.. మింగేసి!

ఎన్డీఏ ప్రభుత్వంలోనూ మాఫియా దోపిడీ ● రేయింబవళ్లు తవ్వకాలు.. తరుగుతున్న ప్రకృతి సంపద ● అక్రమార్కులకు రాజకీయ, అధికారుల అండ





ఉదయగిరి ప్రాంతంలో గ్రావెల్‌ను ట్రాక్టర్‌లో నింపుతున్న ఎక్స్‌కవేటర్

గ్రావెల్, మట్టి ప్రకృతి అందించిన సహజ సంపదలు ఇవి. ఈ విలువైన సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. కానీ కొందరు అక్రమార్కులు ఈ సంపదను దోచేస్తున్నారు. అక్రమార్కులు, రాజకీయ నాయకులు, కొంతమంది అధికారులు మాఫియాగా ఏర్పడి సంపదను కరగబెట్టేస్తున్నారు. వైసీపీ హయాంలో హద్దులు పెట్టి మరీ కొల్లగొట్టిన మాఫియా ప్రభుత్వం మారినా 'తగ్గేదేలా..' అంటూ పేట్రేగిపోతున్నారు. ప్రభుత్వ భూములు, వాగులు, డొంకలతోపాటు చెరువులపై వాలిన మాఫియా గద్దలు రేయింబవళ్లు తవ్వేసి తరలిస్తున్నారు. ట్రక్కుకు ఇంత అని ఎవరికి వారుగా వాటాలు వేసుకుని పంచుకుంటున్నారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలపై 'ఆంధ్రజ్యోతి' బృందం చేసిన పరిశీలనలో నిగ్గుతేల్చే నిజాలు వెలుగులోకి వచ్చాయి.

కందుకూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : మట్టే బంగారం అన్న నానుడి నిజమైంది. గ్రావెల్‌కు విపరీతమైన డిమాండ్ నెలకొనడంతో మట్టి మాఫియా చెలరేగిపోతోంది. రియల్ ఎస్టేట్ వెంచర్లు, గృహ నిర్మాణాలు, ఇటుకబట్టీలు, చిన్నతరహా పరిశ్రమలు, తీర ప్రాంతంలో హేచరీలు, ఇతరత్రా ఏ నిర్మాణం జరగాలన్నా రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు గ్రావెల్ (మట్టి) అవసరం ఎంతో ఉండటంతో మట్టి మాఫియా రెండు చేతులా సంపాదిస్తోంది. ప్రైవేటు భూములను కొనుగోలు చేసి మట్టి తరలించుకోవాలంటే ఎంతో వ్యయంతో కూడిన వ్యవహారం కావడంతో చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు, వాగులు, డొంకలు, దేవదాయ శాఖ భూములలో ఇష్టారీతిగా తవ్వకాలు జరిపి రెండుచేతులా సంపాదిస్తున్నారు. మట్టి మాఫియాకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు మామూళ్ల కోసం సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తుండటం, కొందరు రాజకీయ అండదండలతో వ్యవహారం చక్కబెట్టుకుంటుండటంతో మట్టి అక్రమ తరలింపు వ్యవహారం ప్రహసనంగా మారింది. పత్రికల్లో వార్తలు రావడమో, స్థానికులు పిర్యాదు చేయటమో జరిగితే రెండు రోజులు హడావిడి ఆ తర్వాత యథావిధి అన్న చందంగా మాఫియాకు సహకరిస్తున్నారు.



ఉలవపాడు : వరిగచేను సంఘం వద్ద ఓ వెంచర్‌కు రాజుపాలెం చెరువు లోని గ్రావెల్‌ను తోలి చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

ఆంధ్రజ్యోతి పరిశీలన

● కందుకూరులో విచ్చలవిడిగా..

కందుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లో రామాయపట్నం పోర్టు, ఇతర పరిశ్రమల పేరుతో పెద్దఎత్తున రియల్‌ఎస్టేట్ వెంచర్లు ఏర్పాటవుతున్నాయి. ఈ వెంచర్లకు ఆ మండలాల పరిధిలోని రావూరు, తెట్టు, వీరేపల్లి, రాజుపాలెం, కరేడు తదితర చెరువుల నుంచి గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్నారు. కందుకూరు చుట్టుపక్కల లేఅవుట్లు, జరిగే వివిధ నిర్మాణ పనుల కోసం గ్రావెల్ ట్రక్కు రూ.2వేలు పలుకుతుండటంతో వెంకటాద్రిపాలెం, దూబగుంటలలో భూములను కొనుగోలు చేసి కొందరు గ్రావెల్ వ్యాపారం చేస్తున్నారు. మట్టి తరలించే ప్రాంతాలలో ఉన్న సంప్రదాయ బండ్లబాటలను కూడా వదలకుండా మట్టి తవ్వేస్తుండటం, వ్యవసాయ భూములకు నష్టం జరిగేలా 20 అడుగుల లోతుకు తవ్వుతుండటంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

● వలేటివారిపాలెం మండలం అంకభూపాలపురం, పోలినేనిచెరువు తదితర చెరువుల నుంచి ఇటుకబట్టీల కోసం అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాల్లోనూ రియల్ వెంచర్లు, నిర్మాణ పనుల కోసం చెరువుల్లో మట్టిని తరలించేస్తున్నారు.

ఉదయగిరి : నియోజకవర్గంలోని జలదంకి, కొండాపురం, కలిగిరి, వింజమూరు, దుత్తలూరు, వరికుంటపాడు, ఉదయగిరి, సీతారామపురం మండలాల్లో యథేచ్ఛగా అక్రమంగా మట్టి తరలింపు సాగుతోంది. ఇటీవల వింజమూరు మండలం నల్లగొండ్లలో ఎలాంటి అనుమతుల్లేకుండా రహదారి నిర్మాణానికి నెలల తరబడి గ్రావెల్ తరలిస్తుండగా గ్రామస్థులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన గ్రావెల్ తవ్వే ప్రాంతానికి చేరుకుని వాహనాలు సీజ్ చేయించారు. ఇలా ప్రతి మండలంలో లేఅవుట్లకు, ఇటుకబట్టీలకు, రహదారుల నిర్మాణానికి మట్టిని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.


● అరకొర అనుమతులతో..

ఉదయగిరి నియోజకవర్గంలో 167-బీజీ, 166-బీ, గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారుల నిర్మాణం కొంతకాలంగా జరుగుతోంది. ఈ రహదారుల నిర్మాణానికి కాంట్రాక్టరు అరకొరగా అనుమతులు పొంది ఇష్టారీతిన తవ్వకాలు చేస్తున్నారు. ప్రభుత్వ, అటవీ భూముల్లో సైతం గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. అటవీ భూముల్లో తవ్వకాలు చేపట్టడంతో అధికారులు దాడులు చేసి రూ.లక్షల్లో మామూళ్లు తీసుకొని, రూ.వేలల్లో జరిమానా విధించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే కొందరు లేఅవుట్, ఇటుకబట్టీల యజమానులు ఇరిగేషన్ శాఖకు అనుమతుల కోసం గోరంత చెల్లించి చెరువంతా దోచేస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీ, సచివాలయ ఉద్యోగుల కళ్ల ముందే గ్రావెల్ తరలిపోతున్నా చోద్యం చూస్తుంటారు. మట్టి తరలింపులో ఆయా శాఖల అధికారులకు ముడుపులు ముందుగానే ముట్టజెప్పి అనంతరం తమ పని తాము కానిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

● సర్వేపల్లి నియోజకవర్గంలోనూ మాఫియా పేట్రేగిపోతోంది. వెంకటాచలం, పొదలకూరు, మనుబోలు మండలాల్లో గ్రావెల్‌ను తవ్వి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

బుచ్చిరెడ్డిపాళెం : వైసీపీ పాలనలో నెల్లూరు బ్యారేజీ అభివృద్ధి ముసుగులో చేపట్టిన అక్రమ గ్రావెల్ తవ్వకాల పాపానికి బుచ్చిలోని కనిగిరి రిజర్వాయర్ కరకట్టలు, చారిత్రక 180 ఎకరాల పెనుబల్లి, జొన్నవాడ తిప్ప, 13 ఎకరాలకుపైగా మినగల్లు పాలతిప్పలో గ్రావెల్, తెల్లరాళ్లు కొల్లగొట్టారు. ఈ తవ్వకాలతో ఎప్పుడు వరదలొచ్చినా కనిగిరి రిజర్వాయర్ కరకట్టలకు ముప్పు తప్పదని ఆయకట్టు రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చినా రాత్రిపూట గ్రావెల్ దోపిడీ జరుగుతూనే ఉంది.

● బోగోలు మండలం కప్పరాళతిప్ప దిగువ ప్రాంతంలో అల్లిమడుగు సంఘం వద్ద, తాళ్లూరు తిప్ప నుంచి గ్రావెల్‌ను రాజుపాలెం, నెల్లూరులకు తరలిస్తున్నారు. ఇటీవల పోలీస్‌ల దాడులతో తవ్వకాలు ఆగిపోయాయి. అల్లూరు మండలం నార్తుఆములూరు, బట్రకాగొల్లు గ్రామాల్లో పొలాల నుంచి గ్రావెల్ అక్రమంగా తవ్వుతున్నారు. డిమాండ్‌ను బట్టి టిప్పర్ 6వేల వరకు అమ్ముతున్నారు.



అల్లూరు మండలంలో గ్రావెల్‌ను తీసుకెళ్లుతున్న టిప్పర్

ఆగని గ్రావెల్ దందా!

కావలి : ప్రభుత్వాలు మారినా కావలి నియోజకవర్గంలో గ్రావెల్ దందా మాత్రం ఆగడం లేదు. గత వైసీపీ హయాంలో గ్రావెల్ వ్యాపారం రూ.కోట్లలో జరిగింది. అప్పట్లో అధికారులు పూర్తిగా చేతులెత్తేయడంతో వైసీపీ నేతలకు ఆదాయ వనరుగా మారింది. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రావెల్ అక్రమ రవాణాకు కొంత కళ్లెంపడింది. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో గ్రావెల్ వ్యాపారంతో రూ.కోట్లు గడించగా ఇప్పుడు కూటమి ప్రభుత్వం కట్టడి చేయడాన్ని ద్వితీయశ్రేణి నేతలు వ్యతిరేకించడం, నేతలపై ఒత్తిడి తేవడంతో గ్రావెల్ తవ్వుకునేందుకు కొందరికి అవకాశం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో కావలి నియోజకవర్గంలో అక్కడక్కడా కొంత మేర గ్రావెల్ అక్రమ వ్యాపారం ప్రారంభమైంది. అయితే కావలి ప్రాంతంలో ఎక్కడా పెద్దగా లేఅవుట్లు వేయకపోవడంతో చెరువులలో నీరు ఉన్నందున గ్రావెల్ అందుబాటులో లేదు. దీంతో కావలి మండలంలో రుద్రకోట రైల్వే ట్రాక్‌కు పడమర పొలాల్లో, కొత్తపల్లి, ఆర్వీ పాలెం పొలాల్లో ఎర్రమట్టిని రోడ్లకు, ఇళ్ల నిర్మాణాలకు తోలుతున్నారు. ఇందులో గ్రావెల్ లభించినప్పుడు దానిని రాజుపాలెం, నెల్లూరు ప్రాంతాలకు తరలిస్తున్నట్లు ప్రచారం.



బుచ్చిరెడ్డిపాళెం : కనిగిరి రిజర్వాయర్ పరిసరాల్లో దుస్థితి

ఆత్మకూరులోనూ యథేచ్ఛగా..

ఆత్మకూరు : నియోజకవర్గ వ్యాప్తంగా గ్రావెల్ అక్రమంగా తరలిపోతోంది. అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడంతో పట్టా, ప్రభుత్వ భూములనే తేడా లేకుండా గ్రావెల్‌ను తవ్వి అమ్మేస్తున్నారు. అధికార, ప్రతిపక్ష నాయకులు ఎవరికివారుగా తెరవెనుక ఉండి ఈ వ్యవహారం నడుపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆత్మకూరు మండలం బీచిరువెళ్ల, నారంపేట, నెల్లూరుపాళెం తదితర ప్రాంతాల్లో అక్రమంగా గ్రావెల్ తరలివెళుతోంది. అలాగే ఏఎస్ పేట మండలం కొండమీదకొండూరు గ్రావెల్ తవ్వకాలకు అడ్డాగా మారింది. సర్వే నెంబర్లు 130, 131, 132లలో పట్టాపొలాలతోపాటు ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఇందులో చాలావరకు కొండలు, గుట్టలు ఉండడంతో వీటిపై మాఫియా కన్ను పడింది. రెండు వారాల క్రితం రాత్రి సమయంలో ఎక్స్‌కవేటర్లతో తవ్వి గ్రావెల్‌ను యథేచ్ఛగా తరలించుకుపోయారు. ఆత్మకూరు, సంగం, బుచ్చి మండలాల్లో ఉన్న వెంచర్లకు గ్రావెల్‌ను తరలించి, ట్రాక్టరు మట్టిని రూ.1000 నుంచి 2వేల వరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఏఎస్‌పేట పంచాయతీలోని గండువారిపల్లి చెరువు, అనుమసముద్రం, హసనాపురం చెరువులతోపాటు పలు గ్రామాల్లోని చెరువులు, ప్రభుత్వ భూముల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. అనుమసముద్రం, పెద్దబ్బీపురం, కొండమీదకొండూరు తదితర గ్రామాల్లో కొందరు నాయకులు అతి తెలివిగా పట్టా పొలాలను లీజుకు తీసుకుని మరీ గ్రావెల్‌ను తరలిస్తున్నారు. చేజర్ల మండలంలోని మాముడూరు తిప్ప తదితర ప్రాంతాల నుంచి కూడా గ్రావెల్ తరలుతోంది.





అనంతసాగరం : గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన భారీ గోతులు

కలెక్టర్‌కు రెడ్‌క్రాస్ పురస్కారం

నెల్లూరు (వైద్యం) : నెల్లూరు జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ విశిష్ట సేవలు అందించినందుకుగాను కలెక్టర్ ఆనంద్‌కు గవర్నర్ అబ్దుల్ నజీర్ పురస్కారాన్ని అందచేశారు. గురువారం రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర రాజధాని అమరావతిలో గవర్నర్ ఈ పురస్కారాన్ని కలెక్టర్‌కు అందచేశారు. జిల్లాలో రెడ్‌క్రాస్ ద్వారా మరిన్ని సేవలు అందించాలని గవర్నర్ ఆకాంక్షించారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి పురస్కారం అందుకుంటున్న కలెక్టర్ ఆనంద్

రీసోర్స్‌పర్సన్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), మే 8 (ఆంధ్రజ్యోతి): ఈ విద్యాసంవత్సరం (2025-26) రీసోర్స్ పర్సన్‌లుగా పనిచేసేందుకు ఆసక్తి, అనుభవం కలిగిన ఎస్‌జీటీ, ఎస్ఏ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో బాలాజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్వహించే విద్యా, ఉపాధ్యాయ శిక్షణకు హాజరై రీసోర్స్‌పర్సన్‌లుగా సేవలందించేవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు ఏఎంవో నెల్లూరు-2819 జీమెయిల్‌కు లేదా 94417 00940 నెంబర్‌కు వాట్సప్ ద్వారా దరఖాస్తులు పంపాలని తెలిపారు.

ఉత్తమ పాఠశాలగా పెదపవని గురుకులం

● ఉత్తమ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ, విద్యార్థిని అవార్డులు సొంతం

● అందజేసిన మంత్రి బాలవీరాంజనేయస్వామి



మంత్రిడోలా వీరాంజనేయస్వామి నుంచి అవార్డు అందుకుంటున్న స్నేహలత

లింగసముద్రం, మే 8 (ఆంధ్రజ్యోతి) : టెన్త్, ఇంటర్ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పెదపవనిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేసింది. అలాగే ఉత్తమ ప్రిన్సిపాల్, ఉత్తమ ఉపాధ్యాయ, ఉత్తమ విద్యార్థిని అవార్డులకు కూడా ఎంపిక చేసింది. విజయవాడ లోని శ్రీతుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయులు, ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రసన్న వెంకటేశన్‌లు ఉత్తమ పాఠశాల, ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డును ప్రిన్సిపాల్ స్నేహలతకు అందజే శారు. అలాగే ఈ పాఠశాలకే చెందిన ఉపాధ్యాయులు ప్రవీణ (గణితం), దుర్గాభవానీలకు (సోషియల్) ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు, 10వ తరగతిలో 593 మార్కులు సాధించిన కవితకు ఉత్తమ విద్యార్థి అవార్డు, రూ.20 వేల నగదు అందజేశారు.

వింజమూరు కార్యదర్శి తొలగింపు

కోవూరు/ వింజమూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): వింజమూరు పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌ను విధుల నుంచి తొలగిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ వీఆర్.కృష్ణతేజ మైలవరపు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కోవూరు పంచాయతీ నిధుల్లో రూ.1.17 కోట్ల మేరకు అవకతవకలు, అలాగే మండల పరిషత్ నిధుల్ని దుర్వినియోగం చేసినట్లు నిర్ధారణకు కావడంతో శాఖ పరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. గ్రేడ్- 1 పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ ఆయన నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని జిల్లా పంచాయతీ అధికారి అందచేసిన మూడు రిపోర్టుల్లో తేలిందన్నారు. శివకుమార్‌ను తక్షణమే సస్పెండు చేస్తున్నట్లు ఆదేశించారు. తమ అనుమతి లేకుండా వింజమూరును వదలి వెళ్లకూడదని పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

హంస వాహనంపై వేదగిరీశుడి వైభోగం



నెల్లూరు రురూరల్ (ఆంధ్రజ్యోతి) : వేదగిరి క్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేతంగా స్వామివారికి చప్పర ఉత్సవం జరిగింది. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ ఉత్సర్లను పల్లకీపై కొలువుదీర్చి గిరిప్రదక్షిణ చేశారు. అనంతరం శ్రీవారిని ముస్తాబు చేసిన అర్చకులు హంసవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ అచ్చుత శంకర్‌రెడ్డి, ఈవో గోపి, ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ విజేత వీఎస్‌యూ

ముగిసిన పురుషుల టోర్నమెంట్



వీఎస్‌యూ జట్టుకి ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, వర్సిటీ వీసీ శ్రీనివాసరావు

వెంకటాచలం, మే 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ అఖిల భారత అంతర యూనివర్సిటీల పురుషుల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ విజేతగా విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) జట్టు నిలిచింది. దేశవ్యాప్తంగా పలు యూనివర్సిటీల నుంచి 97 జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. 5 రోజులపాటు జరిగిన ఈ టోర్నీలో చివరిరోజు గురువారం నెల్లూరులోని వీఎస్‌యూ, మహారాష్ట్రలోని సంత్‌గాడ్గే బాబా అమరావతి యూనివర్సిటీ, కేరళలోని కాలికట్ యూనివర్సిటీ, రాజస్థాన్‌లోని మహరాజా సూరజ్‌మాల్ బ్రిజ్ యూనివర్సిటీలు తలపడ్డాయి. ఈ నాలుగు జట్ల మధ్య ఉదయం నుంచి సాయంత్రం వరకు హోరాహోరీగా మ్యాచ్‌లు జరిగాయి. అత్యుత్తమ ప్రతిభ చూపిన వీఎస్‌యూ జట్టు టోర్నమెంట్ విజేతగా నిలిచింది. ఇక ద్వితీయ స్థానంలో జైపూర్ వర్సిటీ, తృతీయస్థానంలో కాలికట్ వర్సిటీ, 4వ స్థానంలో మహారాష్ట్ర వర్సిటీ నిలిచింది. అనంతరం జరిగిన ముగింపు వేడుకలో విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. సర్వేపల్లి, కోవూరు ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు ముఖ్యఅతిథులుగా పాల్గొని విజేతలను అభినందించారు. 4 జట్లకు ఎమ్మెల్యే సోమిరెడ్డి తన సొంత నిధులతో రూ.లక్ష రుపాయలు అందజేశారు. అలాగే వీఎస్‌యూ ప్రధాన ఆర్చీ నిర్మాణానికి వీపీఆర్ ఫౌండేషన్ తరఫున రూ.15 లక్షల విరాళాన్ని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రకటించారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	127
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 500

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9347
వెండి కిలో ధర	రూ. 98.100
వెండి ఒక గ్రాము	రూ.101.10

11న ఆల్ ఇండియా ఓపెన్ చెస్ పోటీలు

కావలి, మే 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ చెస్ అసోసియేషన్, ఆర్ఎల్ఎస్ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఆల్‌ఇండియా ఓపెన్‌చెస్ పోటీలు ఈ నెల 11వ తేదీ ట్రంకురోడ్డులోని ఫెంటాస్టిక్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు ఆర్ఎల్ఎస్ చెస్ అకాడమీ డైరెక్టర్లు రామ,లక్ష్మణ్ తెలిపారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చేతుల మీదుగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. విజేతలకు రూ.52వేలతో పాటు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

రేపు లక్ష్మీనృసింహ జయంతి

కావలి రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైకుంఠపురం పెంకులఫ్యాక్టరీ సంగంలోని యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారి జయంతిని వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు బుర్రా శేష స్వామి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం హోమాలు, అభిషేకాలు నిర్వహించటంతో పాటు మధ్యాహ్నం అన్న సంతర్పణ చేస్తున్నట్లు తెలిపారు. పూజ కార్యక్రమాల్లో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

రాయితీపై దాణా సరఫరా

కొండాపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశుసంవర్ధకశాఖ ద్వారా రాయితీపై విడుదలైన పశువుల దాణాను గురువారం సాయిపేట గ్రామ పశువైద్యాధికారి మధుతో కలసి జిల్లా టెలికం బోర్డు డైరెక్టర్ తాటికొండ అనూష రైతులకు సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వం 50శాతం రాయితీపై ఇచ్చే పోషక విలువలు కలిగి నాణ్యతతో కూడిన దాణాను వినియోగించుకొని పాడిరైతులకు సూచించారు. అలాగే పశువుల ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడంతోపాటు పాల ఉత్పత్తిని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పాడి రైతులు పీ తిరుపతయ్య, బంగారు నాయుడు, మాలకొండయ్య పాల్గొన్నారు.

89 పొగాకు బేళ్లు తిరస్కరణ

కలిగిరి, మే 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు 376పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో ఎనిమిది కంపెనీ ప్రతినిధులు పాల్గొని 287బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-64, ఆర్ఆర్-8, సీఆర్-10, జంపింగ్ లాట్స్-7 కారణాలతో 89బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.210, సగటు ధర రూ.258.28గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి ఇసాక్ స్వరణ్‌దత్ తెలిపారు.

12న స్వరార్చన

కావలి, మే 8 (ఆంధ్రజ్యోతి): తాళ్లపాక అన్నమాచార్యుల 617వ జయంతి సందర్భంగా ఈ నెల 12న పట్టణంలోని వాయునందనప్రెస్ వీధిలోని సంకలవారితోట రామాలయంలో 12వ తేదీ స్వరార్చన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు గణపతిరాజు మారుతీరావు, టంగుటూరి జయశ్రీలు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం సాయంత్రం 4 గంటలకు జరుగుతుందన్నారు.

విద్యుత్ విజిలెన్స్ బృందాల తనిఖీలు

● రూ. 3.2 లక్షల జరిమానా విధింపు

కందుకూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలో విద్యుత్ విజిలెన్స్ బృందాలు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 81మంది విద్యుత్ వినియోగదారులకు రూ. 3.2లక్షలు జరిమానా విధించారు. విద్యుత్ ఈఈ ఎం నాగేశ్వరరావు నేతృత్వంలో 30మంది అధికారులు, 50 మంది సిబ్బంది 34 బృందాలుగా ఏర్పడి నిర్వహించిన తనిఖీలలో 79మంది అదనపు విద్యుత్ వాడుతున్నట్లు గుర్తించి వారికి రూ. 3 లక్షలు జరిమానా విధించారు. అలాగే ఒక కేటగిరిలో విద్యుత్ కనెక్షన్ తీసుకుని వ్యాపార అవసరాలకు వాడుతున్న మరో రెండు సర్వీసులను గుర్తించి వారికి రూ. 20వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వినియోగిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలలో డీఈఈ టీఎం రాఘవేంద్రరావు, ఆర్ విజయ్‌బాబు, పీ యుగంధర్, డివిజన్‌లోని ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.



విజిలెన్స్ బృందాల తనిఖీల అనంతరం మాట్లాడుతున్న ఈఈ నాగేశ్వరరావు, విద్యుత్ శాఖ అధికారులు

20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

కందుకూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): కార్మిక సంఘాలు ఈనెల 20వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు కోరారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సీఐటీయూ సమావేశంలో కార్మిక సమ్మె ఎందుకు అనే బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల పోరాటఫలితంగా కార్మికులు సాధించుకున్న 29 హక్కులను రద్దుపరిచి నాలుగు లేబర్ కోడ్‌లను విధించటం అన్యాయం అని, వెంటనే లేబర్‌కోడ్‌ను రద్దుచేయాలని కోరారు. సమ్మెలో భాగంగా ఈనెల 13న కందుకూరులో నియోజకవర్గ స్థాయి సదస్సు జరుగుతుందని, జిల్లా జాతా 15న కందుకూరు నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎస్కే సల్మా, ఎస్‌ఏ గౌస్, జీవీబీ కుమార్, ఎస్కే పద్మజ, కొట్టె వెంకయ్య పాల్గొన్నారు.

రెవెన్యూ, శాంతి భద్రతలపై ప్రత్యేక గ్రీవెన్స్

● నేడు తహసీల్దారు కార్యాలయంలో కార్యక్రమం

అల్లూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, శాంతి భద్రతల సమస్యలపై ప్రత్యేక గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దారు లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం ఆయన స్థానిక కార్యాలయంలో సిబ్బందితో నిర్వహించిన సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. కలెక్టరు ఆదేశాల మేరకు శుక్రవారం కావలి ఆర్డీవో, పోలీసు శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రీవెన్స్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలు, శాంతిభద్రతల సమస్యలపై ఫిర్యాదులు అందజేయవచ్చని కోరారు. కార్యక్రమంలో డీటీ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ ప్రభు పాల్గొన్నారు.

● రేషన్ కార్డుల మంజూరును వినియోగించుకోండి

రాష్ట్ర ప్రభుత్వం నూతన రేషన్‌కార్డుల మంజూరుకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు లక్ష్మీనారాయణ తెలిపారు. కార్డులు పొందాల్సిన వారు, పేర్లు మార్పుచేర్పులు చేసుకోవాలని కోరారు. అలాగే ఆదాయ పన్ను చెల్లించే ప్రతిఒక్కరూ తమ రేషన్ కార్డులను తహసీల్దారు కార్యాలయంలో అప్పగించాలన్నారు.



సమావేశంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దారు లక్ష్మీనారాయణ

మానవత్వం చాటుకున్న కావలి ఎమ్మెల్యే

కావలి, మే 8 (ఆంధ్రజ్యోతి): రక్తపు మరకలతో రోడ్డుపై పడి ఉన్న మహిళను వెంటనే ఆటోలో తన అనుచరులతో ఆసుపత్రికి పంపించి ఆమెకు వైద్య చికిత్సలు అందించి ప్రాణాపాయం నుంచి కాపాడారు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి. గురువారం ఉదయం ఆయన పట్టణంలోని ఓ కార్యక్రమానికి వెళుతుండగా ట్రంకురోడ్డులోని రూపాయి మిద్దెసెంటర్‌లో పడిఉన్న మహిళను చూసి అందరూ రోడ్డు మార్జిన్‌లో వెళుతుండటాన్ని ఎమ్మెల్యే గమనించారు. వెంటనే కారు దిగి వెళ్లారు. యాచకురాలిని గుర్తుతెలియని వాహనం ఢీకొనటంతో ఆమె రక్తపు మరకలతో రోడ్డు పై పడి స్పృహ కోల్పోయి ఉంది. ఆసుపత్రికి చేర్చిన అనంతరం వైద్యులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆమెకు తల పగిలి ఉండటంతో రెండు కుట్లు వేసినట్లు సమాధానం ఇవ్వడంతో ఆమె కోలుకునే వరకు వైద్యసేవలు అందించాలని సూచించారు.



రోడ్డుమీద పడి ఉన్న యాచకురాలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకట క్రిష్ణారెడ్డి

బిల్లుల మంజూరులో నిర్లక్ష్యంను వీడాలి

అల్లూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల బిల్లుల మంజూరులో నిర్లక్ష్యం వహిస్తే సహించమని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. గురువారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. గోకులం పథకం కింద లబ్ధిదారులకు మంజూరైన బిల్లుల విషయంపై అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లుతో చర్చించారు. స్థానిక సమస్యలను ఆయా గ్రామాల నాయకులు, సర్పంచులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని ఆయన గుర్తుచేసి వివరణ అడిగి తెలుసుకున్నారు. అలాగే పలురకాల ఉపాధి హామీ పనులను గురించి అడిగి తెలుసుకున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు జాగ్రత్తగా వ్యవహరించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, ఎంపీడీఓ రజనీకాంత్, స్థానిక నాయకుడు పలగాటి శ్రీనివాసులు రెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీద గిరిధర్

నా ప్రమేయం లేదు !

● పైలాన్ కూల్చివేతపై తిరువీధి ప్రసాద్ ప్రమాణం

కావలి టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): పైలాన్ కూల్చివేతలో తానే ప్రధాన వ్యక్తినంటూ వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని తనకు అందులో తనకు ఎలాంటి సంబంధం లేదని టీడీపీ నాయకులు తిరువీధి ప్రసాద్ గురువారం కలుగోళశాంభవి అమ్మవారి ఆలయంలో ప్రమాణం చేశారు. వైసీపీ నేతలు ఇటీవల విలేకరుల సమావేశంలో తిరివీధిపై చేసిన ఆరోపణలకు ఆయన స్పందించి ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసీపీ నేతలకు చిత్తశుద్ధి వుంటే గురువారం ఉదయం 11గంటలకు ఆలయానికి వచ్చి ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. పైలాన్ కూల్చిందెవరో ప్రజలకు తెలుసునని త్వరలో అన్ని నిజాలు నిగ్గు తేలుతాయన్నారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు పసలేని ఆరోపణలు దుష్ప్రచారం చేయడం మానుకోవాలన్నారు.

డ్రోన్‌తో పరిశీలన

కావలి రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): రైల్వే ట్రాక్ పరిసరాల్లో అసాంఘిక కార్యక్రమాలు అరికట్టేందుకే డ్రోన్ నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్ఐ రమాదేవి తెలిపారు. గురువారం ఆయన పట్టణ రైల్వే స్టేషన్, స్టేషన్ పరిసరాల్లో డ్రోన్ ఎగుర వేసి ట్రాక్ పరిసరాలు పరిశీలించి మాట్లాడారు. స్టేషన్ పరిసరాలు, ఫ్లాట్‌ఫాంలపై అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నా సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకుకు మద్దతు ధర అందించాలి : ఛైర్మన్

కలిగిరి, మే 8 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన పొగాకునకు మద్దతు ధర అందించాలి పొగాకు బోర్డు ఛైర్మన్ యశ్వంత్ పొగాకు కంపెనీలకు సూచించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించి వేలం ప్రక్రియ, ధరల విధానం, నోబిడ్ బేళ్లను పరిశీలించారు. అనంతరం సాగు దారులతో మాట్లాడారు. మార్కెట్‌కు అనుగుణంగా నాణ్యతా పొగాకు బేళ్లను వేలం కేంద్రానికి తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు చేస్తున్న కంపెనీ ప్రతినిధులు గ్రేడింగ్ ప్రకారం రైతుకు పూర్తి మద్దతు అందించడంతో పాటు అన్నిరకాల గ్రేడ్‌లను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని కోరారు. మార్కెట్ ధరలను ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేస్తూ రైతు అభ్యున్నతికి పాటుపడాలని బోర్డు అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి ఇసాక్ స్వరణ్‌దత్, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్‌కుమార్, కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

పొగాకు బోర్డు వద్ద రోడ్డు ప్రమాదం

● రైతుకు తీవ్ర గాయాలు

కలిగిరి, మే 8 (ఆంధ్రజ్యోతి):స్థానిక పొగాకు బోర్డు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కమ్మవారిపాలెంకు చెందిన పొగాకు రైతు కాటగుంట రాఘవేంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. కలిగిరి పట్టణం నుండి ద్విచక్ర వాహనంపై పొగాకు బోర్డు లోపలికి వెళ్లే క్రమంలో సంగం నుంచి పామూరు వెళ్తున్న కారు ఢీకొనడంతో తల, కాళ్లపై గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని స్థానిక ప్రైవేట్ వైద్యశాలలో ప్రథమచికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కారును స్వాధీనం చేసుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

పీఎంఏవై గృహాలకు త్వరలో ప్రతిపాదనలు : డీఈ

లింగసముద్రం, మే 8 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలో ప్రధానమంత్రి ఆవాస యోజన కింద గృహాల మంజూరుకు త్వరలో ప్రతిపాదనలు పంపించనున్నట్లు గృహ నిర్మాణశాఖ డీఈ పీవీ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం ఆయన గృహ నిర్మాణశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఇప్పటివరకు గృహాల కోసం కందుకూరు రూరల్ మండలంలో 1034 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిలో రెవెన్యూ అధికారులు 574 మందికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చారని, కందుకూరు అర్బన్‌లో 194 మంది దరఖాస్తు చేసుకోగా, 58 మందికి, గుడ్లూరు మండలంలో 1833 మంది దరఖాస్తు చేసుకోగా 1275 మందికి, ఉలవపాడు మండలంలో 1628 మంది దరఖాస్తు చేసుకోగా 733 మందికి, వలేటివారిపాలెం మండలంలో 1612 మంది దరఖాస్తు చేసుకోగా 1338 మందికి, లింగసముద్రం మండలంలో 1138 మంది దరఖాస్తు చేసుకోగా 838 మందికి పీసీలు ఇచ్చారని తెలిపారు. ఇవిగాక కందుకూరు అర్బన్‌లో ఇంటిస్థల పట్టాలున్న 441 మందికి గృహాలు మంజూరయ్యాయని, వీరు వెంటనే పునాదులు నిర్మించుకోవాలని చెప్పారు. ఇంకా గృహాలు అవసరమైన వారు తమ కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏఈ జె నాగరాజు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఘనంగా సీతారాముల కల్యాణం

ఉదయగిరి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండగానిపల్లి గ్రామంలో కోదండరామస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామంతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్ల కల్యాణాన్ని తిలకించారు. నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్నదానంతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆపరేషన్ సిందూర్‌పై హర్షం

దుత్తలూరు (ఉదయగిరి), మే 8 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడులు చేయడంపై బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పహల్గాం దాడికి దీటుగా భారత్ సైన్యం జవాబు ఇవ్వడం అభినందనీయమన్నారు. శక్తివంతమైన నిర్ణయానికి నాయకత్వం వహించిన దేశ ప్రధాని నరేంద్రమోదీకి ప్రజలంతా కృతజ్ఞతలు తెలియజేయాలన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

ఏఎస్ పేట, మే 8 (ఆంధ్రజ్యోతి): మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న సబ్సిడీ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో ప్రసాద్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో 33మందికి రుణాలు అందిస్తామని, ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ఏపీవో బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి, మే 8(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మండల ఇన్‌చార్జి ఏపీవోగా కేటీ ఉమామహేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కలిగిరి మండల ఏపీవోగా పని చేస్తున్న ఆయనకు ఉన్నతాధికారులు అదనపు బాధ్యతలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో బాధ్యతలు స్వీకరించారు.

సోమశిలలో 50.562 టీఎంసీల నీరు

అనంతసాగరం మే 8 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో గురువారం నాటికి 50.562 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1,230, ఉత్తర కాలువకు 30, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. 275 క్యూసెక్కులు ఆవిరి అవుతున్నట్లు తెలిపారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయం

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నిరుద్యోగులకు, మహిళలకు, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయమని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రజాపరిషత్ కార్యాలయంలోని స్త్రీశక్తి భవన్‌లో ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ సహకారంతో ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని 8 మండలాల్లో కుట్టు శిక్షణా తరగతులు జరుగుతాయని, ఇప్పటికి మూడు మండలాల్లో ప్రారంభించడం జరిగిందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు వెయ్యి మంది వరకు శిక్షణ పొందుతారన్నారు. గతంలో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సుమారు 500మంది కుట్టు శిక్షణ నేర్చుకున్నారన్నారు. రెడీ మేడ్ బట్టల తయారీ కేంద్రాన్ని ఏర్పాటుచేస్తే అందరికీ ఉపాధి కలుగుతుందని, ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కోఆర్డినేటర్ పద్మ వీటిని పర్యవేక్షిస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని నేర్చుకున్న ప్రతి మహిళా ఉచిత కుట్టు మిషన్ పొందాలన్నారు. కాగా, ఉగ్రవాదుల చేతిలో భరతమాత బిడ్డలు ప్రాణాలు విడిచారని, భారత పౌరులందరూ ఒక సైన్యంలా మారి ఎటు వంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కోవాలన్నారు. భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి, మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లుయాదవ్, మాజీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, పట్టణ అధ్యక్షుడు కోడూరు నాగిరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు, జడ్పీటీసీ సభ్యుడు గణపం బాలకృష్ణారెడ్డి, జనసేన మండల కన్వీనర్ బండారు సత్యనారాయణ, నాయకులు గణపం సుదర్శన్‌రెడ్డి, వనిపెంట సుబ్బారెడ్డి, మంచాల శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలి : ఎంపీడీవో

ఉదయగిరి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధిహామీ సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎంపీడీవో అప్పాజీ పేర్కొన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో గురువారం ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం అధిగమించాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ ఉపాధి పని కల్పించాలన్నారు. కొలతల ప్రకారం కూలీలు పని చేసేలా చర్యలు చేపట్టి గిట్టుబాటు కూలి వచ్చేలా చూడాలన్నారు. పంట, ఇంకుడు గుంతలు, నీటితొట్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఉమామహేష్, ఈసీ సువార్తయ్య, టీఏలు తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీవో అప్పాజీ

నేడు టీడీపీలోకి వైసీపీ శ్రేణులు

ఉదయగిరి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలం లోని గండిపాళెం పంచాయతీకి చెందిన మండల పరిషత్ ఉపాధ్యక్షుడు, జీ ఎంకే ట్రస్టు అధినేత గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలోకి భారీగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చేరనున్నారు. అందులో భాగంగా గురువారం తన నివాసంలో నాయకులు, కార్యకర్తలతో గుంటుపల్లి సమాలోచనలు చేశారు. ఈసందర్భంగా గుంటుపల్లి ఆధ్వర్యంలో మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య, సర్పంచ్ గొల్లపల్లి కల్పన, మాజీ సర్పంచ్ రాపల్లి భారతీ, ముస్లిం మైనారిటీ నాయకులు తమ అనుచరులు సుమారు 250 కుటుంబాలతో కలిసి శుక్రవారం వింజమూరు టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమయ్యారు.

తప్పుడు కేసులు పెట్టడం వైసీపీ నేతలకే చెల్లు

బిట్రగుంట, మే 8 (ఆంధ్రజ్యోతి): కక్షపూరితంగా తప్పుడు కేసులు పెట్టి టీడీపీ నేతలను ఇబ్బందులకు గురిచేసింది వైసీపీ నేతలకే చెల్లిందని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు అన్నారు. బోగోలులోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో కోట్ల రూపాయల నిధులతో ఏర్పాటు చేసిన పైలాన్‌ను పగులకొట్టించింది మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, ఆయన అనుచరులు కాదా అని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూపి ఓర్వలేక ఈర్షతో బురదజల్లే వ్యాఖ్యలు ఇప్పటికైనా మాను కోవాలని సూచించారు.

ఆత్మకూరులో చిరుజల్లులు

ఆత్మకూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న ఎండలతో అల్లాడుతున్న ప్రజలు గురువారం మధ్యాహ్నం నుంచి వాతావరణం ఒక్కసారిగా చల్లబడి చిరుజల్లులు కురవడంతో ఉపశమనం పొందారు. ఎండలకు అవస్థలు పడుతున్న వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు చిరుజల్లులతో ఊపిరి పీల్చుకున్నారు.

మధుసూదన్‌కు ఘన నివాళి

కావలి టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడిలో మృతిచెందిన కావలి వాసి సోమిశెట్టి మధుసూదన్‌రావు ఉత్తరక్రియలు గురువారం ఏవీఎస్ కల్యాణ మండపంలో చేపట్టారు. ఈ కార్య క్రమంలో ఎమ్మెల్యే కిష్టారెడ్డితోపాటు వివిధ పార్టీల నేతలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంఘాలు, బంధుమిత్రులు పాల్గొని మధుసూదన్‌రావు చిత్రపటానికి నివాళుల ర్పించారు. మాజీ కౌన్సిలర్లు రాజ్‌కుమార్ చౌదరి, అమరా వేదగిరి, టీడీపీ నేత అల్లూర్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్, నూనె మల్లికార్జున యాదవ్, జిల్లా కార్యదర్శి సమ్మెన వెంకటసుబ్బయ్య, శ్రీధర్, భరత్‌కుమార్, బ్రహ్మానందం, కిరణ్‌కుమార్ నివాళులర్పించారు.

తడకలూరులో ర్యాలీ

దగదర్తి (బిట్రగుంట) : తడకలూరులో గురువారం మోడల్ మండల టీం లీడర్ హరిచందన ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ చైతన్య ర్యాలీ నిర్వహించారు. గ్రామ రైతులతో కలిసి స్థానిక టీడీపీ నేత శ్రీహరినాయుడు ప్లేకార్డులు పట్టుకుని ప్రకృతి వ్యవసాయం చేసి పర్యావరణాన్ని పరిరక్షించాలని నినాదాలు చేశారు.

వైభవంగా వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి

సంగం, మే 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్ బజార్‌లో ఆర్య వైశ్యుల ఆధ్వర్యంలో బుధవారం అర్ధరాత్రి వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



వాసవీ కన్యకాపరమేశ్వరికి పూజలు చేస్తున్న అర్చకులు

చలివేంద్రం ప్రారంభం

సీతారామపురం, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బాలాయపల్లి పంచాయతీలోని పోకలవారి పల్లె గ్రామంలో కాకి జాన్ చిన్నయ్య, సంతోషమ్మ జ్ఞాపకార్థం మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం మండల టీడీపీ నాయకులు, మాజీ కన్వీనర్ మొత్తంశెట్టి చెన్నకేశవులు, చింతల శ్రీనివాసులు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి జాషువా చేతుల మీదుగా చలివేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, కాకి సొల్మన్, మండల టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నేతలు

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలో ఇటీవల నలుగురు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు సాంబశివ చారి టబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర రెడ్డి గురువారం వారి ఇళ్లకు వెళ్లి ఆర్థిక సాయం అందజేశారు. 2వ వార్డు పరిధిలోని కప్పల పెంచలయ్య, షేక్ అమీర్‌బీ, 19వ వార్డు పరిధిలో కప్పల కాంతమ్మ, షేక్ సంధాని కుటుంబాలను ఆయన పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.10 వేల వంతున ఆర్థిక సహాయం అందజేశారు.

కెనరా బ్యాంక్‌లో సిబ్బంది కొరత

● ఖాతాదారుల అవస్థలు

ఏఎస్ పేట, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కావలి ఎడవల్లి గ్రామంలోని కెనరా బ్యాంక్‌లో సిబ్బంది కొరతతలో ప్రతిరోజు ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం పలు గ్రామాల నుంచి ఖాతాదారులు బ్యాంక్‌కు విచ్చేశారు. ఉదయం వచ్చి సాయంత్రం వరకు బ్యాంక్‌లో వేచిఉన్నా పనులు కాలేదని పలువురు ఖాతాదారులు కఖవాపోయారు. సుమారు 14 గ్రామాల ప్రజలు ప్రతిరోజు బ్యాంక్‌కు విచ్చేస్తుంటారు. బ్యాంక్‌లో ఐదుగురు ఆఫీసర్లకు గాను ఇద్దరే ఉన్నారని, దీంతో ఇబ్బందులు తప్పడం లేదని, పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలని ఖాతాదారులు కోరుతున్నారు.

క్యారమ్స్‌తో మానసిక ఉల్లాసం

వింజమూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు గురువారం క్యారమ్స్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి జ్యోతి కొండయ్య మాట్లాడుతూ అన్ని వయస్సుల వారు క్యారమ్స్ ఆడేందుకు ఆసక్తి చూపుతారని, దీని వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు